




# విజయభాను

44th వార్షికోత్సవం విజయభాను

విశాఖపట్నం, ఆదివారం 07-03-2021 | VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM | సంపుటి : 43 సంచిక : 151 పేజీలు : 8 వెల : 1 రూపాయి


## హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఘన స్వాగతం



విశాఖపట్నం : రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అరుప్ కుమార్ గోస్వామి కి సర్క్యూట్ హౌస్ లో ఘన స్వాగతం లభించింది. శనివారం మధ్యాహ్నం వారు తరువాయి 2లో..

## రాష్ట్రంలో కాపుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

### సామాజిక భవనాల నిర్మాణానికి చేయూత

### - తుని రైల్వే దహన కేసుల ఎత్తివేతకు ప్రయత్నం - కాపుల ఆత్మీయ సమావేశంలో విజయసాయిరెడ్డి




విశాఖపట్నం : - రాష్ట్రంలో కాపుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని రాజ్యసభ సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి వి.విజయసాయిరెడ్డి అన్నారు. శనివారం స్థానిక మధవధారలోని బొత్స స్క్వేర్ లో నిర్వహించిన కాపుల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్రంలో కాపు సామాజిక భవనాల నిర్మాణానికి చేయూత అందిస్తామన్నారు. విశాఖలో కాపుల భవనం కోసం నాలుగు ఎకరాల స్థలం కేటాయించేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తామన్నారు. అన్ని సామాజిక వర్గాల భవనాలు ఒకే చోట ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వం ఆలోచన చేస్తోందన్నారు. రాష్ట్ర విభజన తర్వాత తూర్పు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయడమే కాకుండా.. 56 కులాలను దానిలో మిళితం చేసి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి కాపుల అభ్యున్నతికి కృషి చేస్తున్నామన్నారు. మరో వైపు కాపు కార్పొరేషన్‌కు చైర్మన్ గా జక్కంపూడి రాజాను నియమించడం జరిగిందని, దాని ద్వారా కూడా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కాపుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించి, తన క్యాబినేట్ లో కాపులకు పెద్దపీట వేయడమే కాకుండా తాజాగా జరుగుతున్న జీవీఎంసీ ఎన్నికల్లో 23 మందికి టికెట్లు ఇవ్వడం జరిగిందన్నారు. ఉద్యమాల సమయంలో చంద్రబాబు పెట్టిన కేసులను తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాటిని తీసివేయించిన విషయాన్ని గుర్తు చేశారు. తుని రైలు దగ్గం కేసులో కేసుల పెండింగ్ లో ఉన్నందున త్వరలోనే కేంద్ర రైల్వే మంత్రి పీయూష్ గోయల్ తో చర్చించి.. వాటిని కూడా రద్దు చేయించే విధంగా ప్రయత్నిస్తామన్నారు. దశలవారీగా కాపుల అభ్యున్నతికి ప్రభుత్వం చేయూత అందిస్తోందన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కురసాల కన్నబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం కాపులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడిందన్నారు. ఉద్యమనేత ముద్రగడతో పాటు అనేక మందిపై ఇష్టారాజ్యంగా కేసులు పెట్టి చిత్రహింసలకు గురి చేశారన్నారు.

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాపులకు పెద్ద పీట వేయడం వల్లే తాను, జిల్లా మంత్రి అవంతి శ్రీనివాసరావు కీలకమైన మంత్రి పదవుల్లో కొనసాగుతున్నామన్నారు. జీవీఎంసీ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. జిల్లా మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు తరువాయి 2లో..



52 వ వార్డు వైకాపా కార్పొరేటర్ అభ్యర్థి జియ్యాని శ్రీధర్ మద్దతుగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న ఎంపీ విజయసాయిరెడ్డి, ఎం వి వి సత్యనారాయణ, మంత్రి కురసాల కన్నబాబు, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త మల్ల విజయప్రసాద్

## వైకాపా పాలనలో వసూళ్లు పర్వం కొనసాగుతుంది

- చంద్రబాబు నాయుడు



వార్త 5లో...

## వాలంటీర్లు సెల్ ఫోన్లను అప్పగించాలి

### జిల్లా కలెక్టరు వి.వినయ్ చంద్




విశాఖపట్నం : జిల్లాలో ఎన్నికలు జరుగుతున్న మున్సిపాలిటలలో పనిచేస్తున్న వాలంటీర్లు తమ అధికారిక సెల్ ఫోన్ లను తక్షణం అప్పగించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అథారిటీ వి.వినయ్ చంద్ ఆదేశించారు.

ఈ మేరకు శనివారం ఒక ప్రకటన జారీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పు మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం వాలంటీర్లు సెల్ ఫోన్ లను అప్పగించాలని ఆదేశాలు జారీ చేసిందని చెప్పారు. మున్సిపాలిటీ కార్యాలయంలో పాలనాధికారి /మేనేజర్ /సంబంధిత అధికారికి తక్షణం తమ సెల్ ఫోన్ లను అప్పగించాలని ఆదేశించారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఫోన్ చేయాల్సి వస్తే మున్సిపల్ కార్యాలయానికి వచ్చి సంబంధిత అధికారి అనుమతితో అధికారి సమక్షం నుండి ఫోన్ చేయవచ్చని ఆయన చెప్పారు. హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పు మేరకు వాలంటీర్లు ఎటువంటి అనధికారక, రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనరాదని ఆయన స్పష్టం చేశారు. అనధికారక కార్యకలాపాల్లో పాల్గొన్నట్లు ఫిర్యాదులు అందితే వారిపై విచారణ చేసి నిబంధనల మేరకు క్రమశిక్షణా చర్యలు చేపడతామని కలెక్టర్ స్పష్టం చేశారు. అనధికార కార్యకలాపాల్లో పాల్గొనే వాలంటీర్ల పై చర్యలు చేపట్టవచ్చని డివిజన్ బెంచ్ స్పష్టంగా పేర్కొనడం జరిగిందని తెలిపారు. వాలంటీర్ల పై ఫిర్యాదులకు కంట్రోల్ రూమ్ : అనధికారిక కార్యకలాపాల్లో పాల్గొనే వాలంటీర్ల పై ఫిర్యాదులను జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ఫోను నెంబరు 0891 2590100 బీ మెయిల్ ఐడిdrovskc-cc@gmail.com లకు తెలియజేయాలని కలెక్టర్ కోరారు. కంట్రోల్ రూమ్ కు ఫిర్యాదు అందిన 12 గంటల లోగా విచారణ చేపట్టడం జరుగుతుందని తెలిపారు. తీవ్ర ఆక్షేపణలు వచ్చిన వాలంటీర్ల పై ఆరోపణలు రుజువైతే డివిజన్ బెంచ్ ఆదేశానుసారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

**మున్సిపాలిటిల వారీగా కంట్రోల్ రూమ్‌లు :**

**జి.వి.యం.సి : 1800 425 00009**
**0891 -2869122**
**2869123 నర్సీపట్నం : 84650 13255**
**08932 295588**
**యలమంచిలి : 08931-231057**
**9701451548బీ 8247064177**

# కోవిడ్ వేక్సిన్ ప్రతీ ఒక్కరూ తీసుకోవాలి

## - శాసనసభ్యులు ధర్మాన ప్రసాదరావు



శ్రీకాకుళం, : జిల్లాలో పెద్దఎత్తున చేపడుతున్న కోవిడ్ వేక్సినేషన్ టీకాను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకొని, కరోనా వైరస్ నుండి విముక్తి పొందాలని మాజీ మంత్రివర్యులు శ్రీకాకుళం శాసనసభ్యులు ధర్మాన ప్రసాదరావు జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. సీనియర్ సిటిజన్స్ వేక్సినేషన్ లో భాగంగా శనివారం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ( రిమ్స్ ) లో శ్రీకాకుళం శాసనసభ్యులు ధర్మాన ప్రసాదరావు దంపతులు కోవిడ్ వేక్సిన్ తీసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ కు కూడా వేక్సిన్ ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, అందులో భాగంగా రిమ్స్ కు వచ్చి వేక్సిన్ తీసుకోవడం జరిగిందని చెప్పారు. జిల్లాలో మార్చి 1 నుండి 60 ఏళ్లు దాటిన వారికి , 40 ఏళ్లు నిండి వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారికి కూడా వేక్సిన్ వేసేందుకు ప్రభుత్వం పెద్దఎత్తున ఏర్పాట్లు చేయడం జరిగిందని అన్నారు. ఇందుకు 105 ప్రభుత్వ ఆసుపత్రులు (పి.హెచ్.సిలు, సి.హెచ్.సిలు )లతో పాటు 9 ఆరోగ్య శ్రీ ట్రస్ట్ గుర్తింపు పొందిన ప్రైవేటు ఆసుపత్రులు గుర్తించారని తెలిపారు. ప్రైవేటు ఆసుపత్రులలో రూ.250/-లు రుసుము వసూలు చేస్తారని, 105 ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగా వేక్సిన్ వేసేందుకు ఏర్పాట్లు జరిగాయని వివరించారు. ఇప్పటివరకు మొదటి డోస్ క్రింద ఫ్రంట్ లైన్ వారియర్లు అయిన 16,327 మందికి రెండవ డోస్ క్రింద 10,687 మందికి వేక్సిన్ ఇవ్వడం జరిగిందని చెప్పారు. అలాగే పారిశుధ్ధ్య కార్మికులు, ఇతరులకు మొదటి డోస్ క్రింద 18,370 మందికి రెండవ డోస్ లో 1,410 మందికి వేక్సిన్ వేయడం జరిగిందని శాసనసభ్యులు తెలిపారు. అదేవిధంగా పోలీసు శాఖలో పనిచేస్తూ రిస్క్ ఎక్కువ కలిగిన 2,269 మందికి వేక్సిన్ ఇవ్వడం జరిగిందని, అలాగే 60 ఏళ్లు దాటిన 3,126 మందికి, 40-55 ఏళ్లు నిండి వివిధ వ్యాధులతో బాధపడుతున్న 866 మందికి వేక్సినేషన్ చేయడం జరిగిందని తెలిపారు. దీనిపట్ల ఇప్పటికీ కొంతమందికి అపోహలు ఉన్నాయని, తెలిసీ తెలియని వారు అభిప్రాయాలు వ్యక్తం చేయడం, కొంతమందిలో కొన్ని అనుమానాలు, భయాలు ఉండటం వలన ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సౌకర్యాలను ఉపయోగించుకోలేని వారు ఉన్నారని అన్నారు. అటువంటి భయాలను ప్రారద్రోలేందుకే భారత ప్రధాని తొలి డోస్ తీసుకున్నారని, ఆ విషయాన్ని మనందరం తిలకించడం జరిగిందని గుర్తుచేసారు. కేంద్ర మంత్రులు, రాష్ట్ర ముఖ్యమంత్రులు , మంత్రులు, వైద్యులందరు తీసుకోవడం జరిగిందని, అయినప్పటికీ ఇంకా భయం ఎందుకని శాసనసభ్యులు ప్రశ్నించారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న ఒక కార్యక్రమం ఇదని, మనదేశంలో కూడా 130 కోట్ల మందికి వేక్సినేషన్ అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందని, ఇందుకోసం వేలాది కోట్లు ఖర్చుచేసేందుకు సిద్ధమైందని చెప్పారు.

తెలిసీ తెలియని అభిప్రాయాలను నమ్మి వేక్సినేషన్ తీసుకోకపోవడం అమాయకత్వం అవుతుందని తెలిపారు. మన జిల్లాలో ఇంత పెద్దఎత్తున చేపడుతున్న ఈ సౌకర్యాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, ఇంకా టీకా వేసుకోని సీనియర్ సిటిజన్స్, ఇతర వ్యాధులతో బాధపడుతున్నవారు గాని ఉంటే తక్షణమే వివరాలు నమోదుచేసుకొని టీకా తీసుకొని వైరస్ నుండి విముక్తి పొందాలని ఆయన సూచించారు. ఇదివరకే మొదటి డోస్ తీసుకున్న వారు 28 రోజుల తర్వాత రెండవ డోస్ తీసుకోవాలని, జిల్లా ప్రజలందరూ టీకాను ఉపయోగించుకోవాలని ఆయన వివరించారు.

ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. బగాది జగన్నాధరావు, రాష్ట్రీయ బాల స్వాస్థ్య ఆరోగ్య కార్యక్రమం జిల్లా సమన్వయ అధికారి డా. కె.అప్పారావు, డా. కె.కృష్ణమోహన్, ఆర్.ఎం.ఓ డా. అరవింద్, రిమ్స్ సూపరింటెండెంట్ రామకృష్ణ, వరుదు విజయకుమార్, సాధు వైకుంఠరావు, లుకలాపు గోవిందరావు , ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## రాష్ట్రంలో కాపుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

మాట్లాడుతూ తాను ఎప్పుడూ కాపుల సమస్యల పరిష్కారానికే అధిక ప్రాధాన్యమిస్తామన్నారు. కాపుల వల్లే తాను ఈ స్థాయికి చేరుకోగలిగానన్నారు. త్వరలోనే కాపుల సమస్యలను పూర్తిగా పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ, గుడివాడ అమర్‌నాథ్, రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, రాష్ట్ర డైరెక్టర్ ఎం. ఆనందరావు, మాజీ శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు, చింతలపూడి వెంకట్రామయ్య, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, వైజాగ్ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, అడవివరం కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ కర్రి అప్పలస్వామి తదితరులు పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి జిల్లా కాపునాడు అధ్యక్షుడు తోట రాజీవ్ సమన్వయకర్తగా వ్యవహరించగా, రాష్ట్ర కాపునాడు గౌరవాధ్యక్షులు బి.ఎన్.మూర్తి అన్ని ఏర్పాట్లు చేశారు. తొలుత తోట రాజీవ్ కాపుల సమస్యలను సభావేదికగా విజయసాయిరెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో అతిథులను సింహాద్రినాథుని జ్ఞాపికలు, గజమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీలా ఉమారాణి వందన సమర్పణ చేయగా నగరం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున కాపులు తరలివచ్చారు.

## హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఘన స్వాగతం

విజయనగరం నుండి విశాఖపట్నం సర్క్యూట్ హౌస్ కు చేరుకున్నారు. పోలీసుల నుండి ప్రధాన న్యాయమూర్తి గౌరవ వందనం స్వీకరించారు. ఘన స్వాగతం పలికిన వారిలో జిల్లా జడ్జి జస్టిస్ ఎ. హరిహర నాదశర్మ, జిల్లా కలెక్టర్ వి. వినయ్ చంద్, నగర పోలీసు కమిషనర్ మనీష్ కుమార్ సిన్హా, డిఐజి ఎల్. కాళిదాసు వెంకట రంగారావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి.ఎం.రెడ్డి, డిసిపి ఐశ్వర్య రస్తోగి, ఆర్.డి.వో.పెంచల కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబుకు విశాఖలో అడుగుపెట్టే హక్కే లేదు



విశాఖపట్నం : టీడీపీ నేతలకు విశాఖ ప్రజలను ఓట్లు అడిగే హక్కు లేదని ఎమ్మెల్యే గుడివాడ అమర్‌నాథ్ మండిపడ్డారు. పేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తుంటే కోర్టుకు వెళ్లి అడ్డుకుంటున్నారని, టీడీపీపై ప్రజలకు ఎప్పుడో నమ్మకం పోయిందన్నారు. ఏపీకి తండ్రీకుమారుల శని పట్టుకుందని, లోకేష్ అడ్డదారిలో మంత్రి అయ్యారని ధ్వజమెత్తారు. 'కుప్పం నియోజకవర్గం ప్రజలే చంద్రబాబును నమ్మలేదు, చంద్రబాబుకు ప్రజలు ఎందుకు ఓటు వేయాలి' అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలను ఓట్లు అడిగే హక్కు చంద్రబాబుకు లేదని, విశాఖ ప్రజలకు చంద్రబాబు ఏమీ చేయలేదని పేర్కొన్నారు. విశాఖను చంద్రబాబు వాడుకున్నారు తప్ప.. అభివృద్ధి చేసిందేమీ లేదని మండిపడ్డారు. చంద్రబాబుకు విశాఖ ఉపయోగపడింది తప్ప..విశాఖకు చంద్రబాబు ఎన్నడూ ఉపయోగపడలేదని ఆరోపించారు. చంద్రబాబుకు విశాఖలో అడుగుపెట్టే హక్కే లేదని, చంద్రబాబు చెప్పే అబద్ధాలను ప్రజలు నమ్మవద్దని తెలిపారు. విశాఖకు అండగా నిలబడేది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని, విశాఖకు ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకొచ్చేది సీఎం జగనేనని పేర్కొన్నారు.

# 8 న ఎస్బిఐ పథకాలపై అవగాహన కార్యక్రమం



శ్రీకాకుళం : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పథకాలపై ఈనెల 8వ తేదీన ఒక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్బిఐ రీజనల్ మేనేజర్ తపోదన్ దేహారి తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ ఎస్బిఐ అనేక పథకాలను ప్రభుత్వ, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు అమలు చేస్తుందని వాటిపై అవగాహన కల్పించుటకు 8వ తేదీ ఉదయం 10 గంటల నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ పథకాలతోపాటు ప్రభుత్వ స్వయం ఉపాధి పథకాలకు ఎస్బిఐ చేపడుతున్న చర్యలు, సంబంధిత విషయాలు కూడా ఇందులో ప్రదర్శించడం జరుగుతుందని వాటిని ఉద్యోగులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# ఎస్టీ కమిషన్ చైర్మన్ నియామకం హర్షణీయం

## - సీఆర్పీఎఫ్ రూరల్ జిల్లా కన్వీనర్ బాకా లవకుశ



విశాఖపట్నం : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర షెడ్యూల్డ్ ట్రైబ్స్ కమీషన్(ఎస్టీ) కమీషన్ చైర్మన్ గా కుంభా రవిబాబును ప్రభుత్వం నియమించడం హర్షణీయమని చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం(సీఆర్పీఎఫ్)విశాఖ రూరల్ జిల్లా కన్వీనర్ బాకా లవకుశ అన్నారు. శనివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో లవకుశ మాట్లాడుతూ విశాఖ ఏజన్సీ లోని దాదాపు అన్ని మండలాల్లో గిరిజన విద్యార్థులు, బాలలు అధిక అధిక శాతం మంది అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇటువంటి సమయంలో ఎస్టీ కమీషన్ చైర్మన్ నియామకంతో గిరిజనుల్లో బాలల్లోను విద్యార్థుల్లో ఎంతో బాసటను ఇచ్చిందని అన్నారు. దీర్ఘకాలికంగా అడవి బాలలు ఎద ౦ర్కొంటున్న సమస్యలను, ఇబ్బందులను సీఆర్పీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ గొండు సీతారాం నేతృత్వంలో కమీషన్ చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార దిశగా అడుగులు వేస్తామని అన్నారు. ఇప్పటికే తమ ఫోరం అన్ని మండలాల్లో బాలలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, సౌకర్యాల లేమి,పాఠశాలల కట్టడాలు,నూతన అంగన్వాడీ కేంద్రాల ఏర్పాటు,సంక్షేమ హాస్టళ్ల ఏర్పాటు తదితర అంశాలపై సేకరిం చిన అంశా లను ఒక నివేదిక రూపంలో అందజేయ నున్నామని అన్నారు,కమీషన్ సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కార దిశగా కమీషన్ పైన ప్రభుత్వంపైన ఒత్తిడిని పెంచుతామని అన్నారు. త్వరిత గతిన ఎస్టీ కమీషన్ చైర్మన్ నియామకం చేపట్టిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డికి,గిరిజన సంక్షేమశాఖ మంత్రి పుష్పశ్రీ వాణికి తమ ఫోరం తరపున ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నామని అన్నారు.



*ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ రోజు జాకీర్ హుస్సేన్ నగర్, లో 53 వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి అయిన నీరుకొండ దివాకర్ గారు స్థానిక ప్రజలను కలిసి వార్డు సమస్య లు తెలుసుకుని, వాటి పరిష్కారం దిశగా కృషి చేస్తానని హామీ ఇస్తూ జనసేన సిద్ధాంతాలను ప్రజలకు తెలియచేస్తూ ఇంటింటి ప్రచారం చేయటం జరిగినది. ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున బిజెపి నాయకులు జనసైనికులు వీర మహిళలు పాల్గొనటం జరిగినది.*



*17వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి గేదెల లావణ్య నాగరాజు వెంకోజిపాలెం గ్రామంలో లో ప్రచారం సాగించారు. ప్రచారంలో పెద్దఎత్తున వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, మహిళలు పాల్గొని జై జగన్ జై లావణ్య నాగరాజు అంటూ ముందుకు సాగారు.*

# వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి

## - కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బెందాళం పద్మావతి



విశాఖపట్నం : పుట్టిన పిల్లల నుంచి వృద్ధుల వరకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి కుల, మత, వర్గ ,పేద, పార్టీలకతీతంగా అవినీతి రహితంగా అమలు చేస్తున్న మన రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా నిరంతరము అపర చాణుక్యుని వలె పనిచేస్తున్న రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి బలపరిచిన మన వైజాగ్ కార్పొరేటర్ అభ్యర్థులను మీ అమూల్యమైన ఓటు ఫ్యాన్ గుర్తు పై వేసి గెలిపించాలని ఆంధ్ర ప్రదేశ్ కళింగ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పద్మావతి కోరారు . రానున్న రోజుల్లో పరిపాలనా రాజధానిగా విశాఖపట్నం కాబోతుందని, విశాఖపట్నం అంటే ఎంతో మమకారం గల ముఖ్యమంత్రికి వైజాగ్ మేయర్ పీఠాన్ని బహుమతి అందించాలని ఆమె ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# పేరెంట్స్ కమిటీ చైర్మన్‌ను తొలగించవద్దు

మాకవరపాలెం : బిఎస్‌పేటలో ఉన్న పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్‌ను తొలగిస్తే ఊరుకునేది లేదని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

అధికార పార్టీకి చెందిన వారు పేరెంట్స్ కమిటీని మార్పు చేయాలంటూ.... ఉపాధ్యాయులపై ఒత్తిడి తెస్తు న్నారని ఆరోపించారు. ఏ కారణం చేతనైనా ఈ కమిటీని తొలగిస్తే పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. దీనిపై ఎంఇఒ సాయిశైలజ మాట్లాడుతూ కమిటీ సభ్యులను మార్పు చేసే ఉద్దేశ్యం ఏమి లేదని చెప్పారు.

# రెండవ జోన్ లో పర్యటించిన జివిఎంసి కమిషనర్



విశాఖపట్నం :- జివిఎంసి కమిషనర్ నాగలక్ష్మి.ఎస్ శనివారము, రెండవ జోన్ పరిధి 6వ వార్డులో గల గాయత్రి నగర్ జె.ఎన్.ఆర్.ఎం. హౌసింగ్ కోలనీ సందర్శించారు. అక్కడ ప్రజలతో మాట్లాడుతూ మంచినీటి సరఫరా పారిశుధ్యం సేవలు అందడం గురించి అడిగి తెలుసుకున్నారు. కోలనీవాసులు ఒక సంఘాన్ని ఏర్పాటు చేసుకొని ఆ సంఘం ద్వారా కోలనీ నిర్వాహణ పనులు చేపట్టాలని ప్రజలకు సూచించారు. పై అంతస్తుల నుండి చెత్తను క్రింద కాలువలో పడి వేయకుండా, శానిటరీ నేప్కిన్స్ యుజీడీ మెన్ హెూల్స్ నందు పడవేయకుండా, మహిళలకు అవగాహన కల్పించాలని జోనల్ కమిషనరును ఆదేశించారు. రెండవ పూట కాలువలలో పూడికలు తీయించడం, రోడ్లు ఊడ్చడం వంటి పనులు, పారిశుధ్య కార్మికులతో చేయించాలని శానిటరీ ఇన్ స్పెక్టర్లను ఆదేశించారు. ప్రతిరోజూ రెండు పూట పనులను కూడా పర్యవేక్షించాలని జోనల్ కమిషనరును ఆదేశించారు.

***రెండు జోన్ లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల ఏర్పాటు పరిశీలన***

ఎన్నికల ఏర్పాట్లు పరిశీలనల్లో భాగంగా జివిఎంసి కమిషనర్ నాగలక్ష్మి .ఎస్, రెండవ జోన్ లో గల వార్డులకు సంబంధించి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ఏర్పాట్లు నిమిత్తం సాంకేతిక ఇంజనీరింగ్ కాలేజ్, మైదాన ప్రాంతాన్ని ఇంజనీరింగ్ అధికారులు, అదనపు కమిషనర్ తో కలిసి పరిశీలించారు. ఎలక్షన్ కమిషన్ సూచనల మేరకు, ఎన్నికల మెటీరియల్ పంపిణీకు సంబంధించిన రివైజ్డ్ ప్లాను తయారుచేసి సమర్పించాలని ఇంజనీరింగ్ అధికారులను మరియు జోనల్ కమిషనర్ ను ఆదేశించారు. డిస్ట్రిబ్యూషన్ సెంట్రర్ లో పోలింగు సిబ్బందికి ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా తగు ఏర్పాట్లు చేయాలన్నారు.ఎండాకాలం దృష్టిలో పెట్టుకొని సామియానల ఏర్పాటు, మంచినీటి సౌకర్యం, భోజనం ఏర్పాట్లు వంటివి చేయాలని జోనల్ కమిషనర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆషాజ్యోతి, జోనల్ కమిషనర్ బి. రాము, పర్యవేక్షక ఇంజనీర్లు గణేష్ బాబు, శివ ప్రసాద్ రాజు, ప్రధాన వైద్యాధికారి కె.ఎస్.ఎల్.జి.శాస్త్రి, కార్యనిర్వాహక ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, వెటర్నరీ సిబ్బంది, శానిటరీ సూపర్వైజర్, శానిటరీ ఇన్స్పెక్టర్, వార్డు సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



# రేషన్ పంపిణీ వాహనాల వద్దే బియ్యం కొనుగోలు చేసుకుంటున్న డీలర్లు

గొలుగొండ : కొంత మంది డీలర్లు, ఎండియు ఆపరేటర్‌కు సహాయంగా వాళ్ల దగ్గర గతంలో పని చేసిన వర్కర్లను నిత్యావసర వాహనం వద్ద కటా వేయడం కోసం ఉంచి కార్డుదారుల నుంచి బియ్యంను బహిరంగంగా కొనుగోలు చేస్తున్నారు. కొంత మంది డీలర్లు బండి వెనకాలా వెళ్లి డబ్బులు పంచుతూ తర్వాత వెళ్లి బియ్యంను తీసుకుంటున్నారని పలువురు బహిరంగంగా చెబుతున్నారు.

కొంత మంది డీలర్లు పని వాళ్లను పెట్టి బియ్యం వ్యాపారం చేస్తున్నారు. మరికొంత మంది డీలర్లు డిపో వద్ద ఎండియు లాగిన్‌లో వెహికల్ మీద సరుకులు సరఫరా చేయకుండా డిపోలో సరుకులు అమ్ముకుంటున్నారు. ఈ విషయం అధికారులు కళ్లముందే జరుగుతున్న పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

కొంత మంది డీలర్లకు గతంలో కంటే ఈ బియ్యం వ్యాపారంలో డబ్బులు ఎక్కువగా వస్తుండటంతో ఎన్ని అవాంత రాలు వస్తున్నా కొంత మంది డీలర్లు ఈ వ్యాపారం యధేచ్చగా కొనసాగిస్తున్నారు. దీనిపై అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

# సింహాద్రి అప్పన్నను దర్శించుకున్న
# బీజేపీ రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహారావు



సింహాచలం : సింహాచల శ్రీ సింహాద్రి అప్పన్నను బిజెపి రాజ్యసభ సభ్యులు జీ విఎల్ నరసింహారావు శనివారము నాడు దర్శించుకున్నారు. సింహగిరి కి చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు సాంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలుకగా ఆలయంలో ఆయన పేరున ప్రత్యేక పూజలు నిర్వహించారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకొని ఆలయ బేడా ప్రదక్షిణ చేశారు.

అనంతరం స్వామివారి ప్రసాదాన్ని అధికారులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర దేవాలయాల అభివృద్ధికోసం కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ప్రసాదం స్కీమ్ క్రింద ఈ సింహాచలం దేవాలయానికి 54 కోట్ల రూపాయలను మంజూరు చేసిందన్నారు. దీనివలన దేవాలయాలు భక్తుల సౌకర్యాల పరంగా అభివృద్ధి పరంగా ముందుకు వెళ్లాలని కేంద్ర ప్రభుత్వం కోరుకుంటోంది అని అన్నారు. అదే విధంగా శ్రీ శైల దేవస్థానం కు కూడా ప్రసాదం స్కీమ్ క్రింద నిధులు మంజూరు చేశారని అన్నారు. దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మక దేవాలయం సింహాచలం దేవస్థానం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ దేవాలయాల అభివృద్ధికి సంయుక్తంగా పాటుపడుతున్నాయన్నారు.

ఈ కార్యక్రమంలో ఆయన వెంట నగర బీజేపీ నాయకులు మరియు 98 వ వార్డు బీజేపీ జనసే న

ఉమ్మడి అభ్యర్థి పేరి శ్రావణ్ కుమార్ మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు.

# మంత్రి ముత్తంశెట్టి సమక్షంలో
# 50 మంది అనుచరులతో వైసీపీలో చేరిన మజ్జి సూరిబాబు



సింహాచలం : 98 వ వార్డు సింహాచలం విజినిగిరి పాలెంలో మంత్రి ముత్తం శెట్టి సమక్షంలో వైసీపీ కార్పొరేటర్ అభ్యర్థి ఎర్ర వరం బాబు ఆధ్వర్యంలో అడివివరం కో ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ మజ్జి సూరిబాబు సుమారు 50 మంది అనుచరులతో వైసీపీ లో చేరారు. వీరికి మంత్రి అవంతీ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మీ గ్రామం అభివృద్ధి సాధించాలంటే వైసీపీ కార్పొరేటర్ అభ్యర్థి ఎర్ర వరం బాబు ను అత్యధిక మెజార్టీ తో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మజ్జి సూరిబాబు మాట్లాడుతూ పార్టీ కోసం అహర్నిశలు కష్టపడతామని పార్టీ నీ మరింత ముందుకు తీసుకెళ్లేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో 98 వార్డు అధ్యక్షుడు కోలుసు ఈశ్వర్ రావు. వైసీపీ కార్పొరేటర్ అభ్యర్థి ఎర్ర వరం బాబు దాసరి కనకరాజు కర్రి సత్తిబాబు కర్రి స్వామి లంక సత్తిబాబు బంటుబిల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# యశోదను గెలిపించండి... అభివృద్ధికి సహకరించండి



అనకాపల్లి : గడిచిన 20 నెలల్లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టణంలో ఎమ్మెల్యే గుడివాడ అమర్నాథ్ డ్రైనేజీలు రోడ్లు కల్యాణమండపాలు నిర్మాణాలు వంటి పలు అభివృద్ధి పనులు చేశారని అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలను అందించారని 84 వ వార్డు వైసిపి కార్పొరేటర్ అభ్యర్థి యశోద రవి అన్నారు. వైసిపి చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కొనసాగాలంటే వైసిపి అభ్యర్థులను కార్పొరేటర్లు గా గెలిపించాలని కోరారు శనివారం ఉదయం వార్డు పరిధిలోని గోపాలకృష్ణ థియేటర్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా యశోద రవి దంపతులకు ప్రజలు హారతులతో స్వాగతం పలికి బ్రహ్మరథం పట్టారు ఈ సందర్భంగా పలక యశోద రవి మాట్లాడుతూ అంజయ్య కాలనీ కి దగ్గరలో గల వ్యవసాయ పరిశోధన కేంద్రంలో రూ 500 కోట్ల నిధులతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి మెడికల్ కళాశాల నిర్మాణం ప్రభుత్వం అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను సీఎం జగన్ ప్రభుత్వం పూర్తిచేసి రాష్ట్ర ప్రజల మన్ననలు పొందారన్నారు వైసీపీ నుంచి పోటీ చేస్తున్న కార్పొరేటర్ అభ్యర్థుల గెలుపు తోనే అనకాపల్లి పట్టణ అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైకాపా పాలనలో
# వసూళ్లు పర్వం కొనసాగుతుంది
### -చంద్రబాబు నాయుడు





ములగాడ: వైకాపా పాలనలో వసూళ్లు పర్వం కొనసాగుతుందని మాజీ ముఖ్య మంత్రి, తెదేపా జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు మండిపడ్డారు. శనివారం పశ్చిమ నియోజకవర్గం పారిశ్రామిక ప్రాంతం కోర మండల్ గేట్ వద్ద నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో చంద్రబాబునాయుడు మాట్లాడుతూ.. షిప్‌యార్డ్ సిక్ అవ్వకుండా జాగ్రత్తలు తీసుకున్నానని అన్నారు. ఓటు వేయకుంటే సంక్షేమ పథకాలి వ్వమంటారా? అని ప్రశ్నించారు. వైకాపా ప్రభుత్వం ఆదాయానికి మించి అప్పులు చేస్తున్నారని విమర్శించారు. వడ్డీలు కట్టలేని పరిస్థితి వస్తే ప్రజల భవిష్యత్తు ఏంటని ప్రశ్నించారు. వైకాపా పాలనలో ఎక్కడ చూసినా వసూళ్ల పర్వం కొనసాగుతోందని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటాయని అన్నారు. వంట నూనె, పప్పులు, ఉప్పు, కొనలేని పరిస్థితి నెలకొంది అని అన్నారు. ఎన్నికల్లో ముద్దులు పెట్టి,గెలిచిన తర్వాత పిడి గుద్దులు జగన్ గుద్దు తున్నాడని విమర్శించారు. తెదేపా హయాంలో ఎక్కడైనా వసూళ్లు జరిగాయా? విశాఖ ప్రజలంతా నా సొంత కుటుంబం. బెదిరించి విశాఖలోని భూములను లాక్కుం టున్నారు. వైకాపాను గెలిపిస్తే రేపు మీ ఇంటినీ లాక్కుంటారు. రౌడీలు, గూండాల నుంచి విశాఖను కాపాడాలి అని చంద్రబాబు అన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో రాష్ట్ర తెదేపా అధ్యక్షుడు కె. అచ్చం నాయుడు, మేయర్ అభ్యర్థి పీలా శ్రీనివాసరావు,పశ్చిమ తెదేపా ఎమ్మెల్యే పి గణబాబు, 58,59,60,61,62,63 వార్డుల కార్పొరేటర్ అభ్యర్థులు మణిరత్నం,లాలం లావణ్య, శ్యామ్ సుధాకర్, సర్వసిద్ధి శ్రీలక్ష్మి, జోజిబాబు, గల్లా చిన్న,ఆర్ ఆర్ రాజు, తేదేపా నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## ఈ నెల 9 నుండి స్వయంభూ గౌరీశ్వర స్వామి ఆలయంలో
# శివరాత్రి మహోత్సవ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభం

చోడవరం : పట్టణంలోని స్వయంభు గౌరీశ్వర స్వామి వారి ఆలయంలో ఈ నెల 9 నుండి శివరాత్రి మహోత్సవ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభ అవుతున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గూనూరు సత్యనారాయణ (సత్తిబాబు), ఆలయ అర్చకులు కొడమంచిలి చలపతిరావు తెలిపారు.

ఆలయ ధర్మకర్త మండలి, దేవాదాయ శాఖ ఈవో ఎస్ వి వి సత్యనారాయణమూర్తి , ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో....

ఈ నెల 9న రాత్రి 9 గంటలకు పార్వతి కళ్యాణం హరికథ, 10 న రాత్రి 9 గంటలకు వీరాభిమన్యు బుర్రకథ, 11 గురువారం మహాశివరాత్రి రోజున ఉదయం 9 నుండి 12 వరకు అన్నమాచార్య కీర్తనలు, ఏడు గంటలకు కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శన, 9 గంటలకు ప్రముఖ గాయని కిరణ్ మై చే సంగీత విభావరి, ఒంటిగంటకు చింతామణి నాటకం, 12న రాత్రి 9 గంటలకు సత్య హరిచంద్ర కాటి సీను, 13న రాత్రి 9 గంటలకు చీమ చీమ ఎందుకుంటావ్, బొమ్మలు నాటిక ప్రదర్శన, 14 ఆఖరి రోజున రాత్రి 7 గంటలకు కోలాట ప్రదర్శన, 9 గంట లకు రోషన్ లాల్ ఆర్కెస్ట్రా, 10 గంటలకు సినీ నేపథ్య గాయని మంగ్లీ, టీవీ కళాకారుల ప్రదర్శన సన్మానం ఉంటాయని....

కార్యక్రమాలన్నింటినీ విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.

# ప్రజలే ముఖ్యం... సేవే లక్ష్యం...
## విజయం వైపు దూసుకుపోతున్న 31వ వార్డు టీడీపీ అభ్యర్థి వానపల్లి రవికుమార్



విశాఖపట్నం : ప్రజలే ముఖ్యం.. సేవే లక్ష్యంగా ముందుకు వెళ్ళడమే ప్రధమ కర్తవ్యంగా భవిస్తూ విజయం వైపు దూసుకు పోతున్నారు జీవీఎంసీ 31 వ వార్డు టీడీపీ అభ్యర్థి వానపల్లి రవికుమార్. జీవీఎంసీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం కనకల దిబ్బ, వాంబేకోలని, మెయిన్ రోడ్, సరస్వతీ పార్క్, డాబా గార్డెన్స్,లీలామహల్ రోడ్ తదితర ప్రాంతాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు.ఆది నుంచి ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా ప్రజా సేవ చేస్తూ అందరికీ సేవకుడిగా మారనని, పదవులతో సంబంధం లేకుండా నిరంతరం వార్డు అభివృద్ధికి కృషి చేశానని, భవిష్యత్తులో కూడా పనిచేస్తానని వివరించారు. వార్డు లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పార్కుల సుందరికరణ, వీధి దీపాల మరమ్మతులు, మంచినీటి సరఫరా మెరుగు, నూతన పైపులైన్లు, చేతిపంపుల పునరుద్ధరణ పనులు ముమ్మరంగా చేపడుతామని వానపల్లి రవికుమార్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. పిలిస్తే పలికే మంచి మనిషిగా రవికుమార్ వార్డు ప్రజల్లో నమ్మకం చోరగొన్నారు. ఎప్పుడు ఎలాంటి అవసరం వచ్చినా నేను ఉన్నానంటూ ఇంటికీ పెద్ద దిక్కుగా నిలబడుతారని పలువురు మహిళా ఓటర్లు పేర్కొన్నారు. మార్చి 10 న జరిగే జీవీఎంసీ ఎన్నికల్లో వానపల్లి రవికుమార్ కు సైకిల్ గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలుపించుకొంటామని వార్డు ప్రజానీకం ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రచారం పొడవునా మహిళలు రవికుమార్ పై పూల వర్షం కురిపిస్తూ హారతులతో ఘణస్వాగతం పలుకు తున్నారు. ప్రచారంలో వార్డు అధ్యక్షులు సారిపల్లి మహేష్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నేతలు, యువ నేతలు, వానపల్లి యువసేన సభ్యులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## విశాఖ పార్లమెంటరీ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శిగా
# నియమితులైన పాశర్ల ప్రసాద్



సింహాచలం : 98 వ వార్డు సింహాచలం టీడీపీ నాయకుడు విశాఖ టీడీపీ అర్బన్ ఉపాధ్యక్షుడు పాశర్ల ప్రసాద్ కి పార్టీ అధినాయకత్వం పార్టీకి తన సేవలను గుర్తిస్తూ విశాఖపట్నం పార్లమెంటరీ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ నియామకఉత్తర్వులు జారీ చేశారు.

ఈ సందర్భంగా....

పాశర్ల మాట్లాడుతూ నాకు ఈ అవకాశాన్ని కల్పించిన అధినాయకత్వానికి పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

# గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే



అచ్యుతాపురం : గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యే యు.వి రమణ మూర్తి రాజు కృషి చేస్తున్నారని యల మంచిలి మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ నర్మాల కుమార్ అన్నారు. శనివారం దోసూరు పంచాయితీ శివారు గండి వానిపాలెం నుండి గొల్లల పాలెం వెళ్లే సీసీ రోడ్లు పనులకు ఆయన భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్మాల కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తి రాజు (కన్నబాబు రాజు) ఆదేశాలతో సీసీ రోడ్లు పనులు ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్ ప్రసాద్, గండి అప్పారావు, పైల పైడిరాజు, వెంకటరావు, ప్రసన్న కుమార్ తదితరులు ఉన్నారు.

# అభివృద్ధి వైసీపీతోనే సాధ్యం...
### - నీలిమ భాస్కర్



అనకాపల్లి : ముఖ్యమంత్రి జగన్ ఆశయాలకు అనుగుణంగా పని చేస్తూ వార్డు పరిధిలోని ప్రజలకు కష్టసుఖాలలో తోడుగా ఉంటూ వారికి అవసరమైన మౌలిక వసతులను కార్పొరేషన్ నిధుల ద్వారా అందేలా తప్పక కృషి చేస్తానని 80 వా వార్డ్ వైసిపి అభ్యర్థిని కొణతాల నీలిమ భాస్కర్ భరోసానిచ్చారు. శని వారం కొప్పాకలో ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తు పై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు పరిధిలో తనకంటూ ప్రత్యేక స్థానం ఉండేలా ప్రజల మన సుల్లో చిరస్థాయిగా నిలిచే పథకాలను అందించే దిశగా పని చేస్తానన్నారు ఈ సందర్భంగా కొప్పాకలో వెలసిన అనంత పద్మనాభుని కార్పొరేటర్ అభ్యర్థిని కొణతాల నీలిమ భాస్కర్ దర్శించుకొని స్వామి సన్నిధిలో కొంత సేపు సేద తీరారు ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# విజయభాను సంపాదకీయం

## మహిళపై వివక్షకు విద్యయే విరుగుడు

రాజకీయ ఆర్థికరంగంలో కాకలు తీరిన పీవీ నరసింహారావుకు సామాజిక పరివర్తనపై కూడా స్పష్టమైన అవగాహన ఉన్నదనడానికి ఆయన అధికార యంత్రాంగంలో తీసుకున్న చర్యలను ఉదాహరణగా చెప్పవచ్చు. మహిళా సమానత్వం సాధించడానికి విద్యాబోధన కీలకమైనదిగా ఆయన భావించారు. 'మహిళల కోసం సంస్కరణలు, భవిష్యత్ అవకాశాలు' అనే అంశంపై న్యూఢిల్లీలో 1991 ఆగస్టు 21వ తేదీన జరిగిన సదస్సులో ఇచ్చిన ప్రారంభోపన్యాసంలో- విద్యారంగంలో వివక్షను రూపుమాపితే, మిగతా సమస్యలు చాలా వరకు పరిష్కారమవుతాయని ఆయన వివరించారు. మహిళల ప్రయోజనాల పరిరక్షణకు తగిన శాసనం కూడా చేయాలని ఆయన అన్నారు. చట్టం కూడా తోడైతే, విద్యావంతులైన మహిళలు తమ హక్కుల కోసం తామే పోరాడుతారని ఆయన అభిప్రాయపడ్డారు. మహిళల పట్ల వివక్ష పోవాలంటే సమాజంలో పరివర్తన రావాలని కూడా ఆయన బోధించారు.

నేను కొంతకాలం మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్నాను. అనేక అంశాలు క్రోడీకరించి మానవ వనరుల అభివృద్ధి శాఖను నిర్మించవలసి వచ్చింది. ఇది ఆయా శాఖల కార్యదర్శులను ఒకచోట చేర్చడం కాదు, మానవ వనరులకు సంబంధించిన అనేక అంశాలను ఒక సమ్యగ్దృష్టితో చూడటం. ఒక టీచర్ ఒక విద్యార్థిని పాఠశాలకు తీసుకుపోవాలని భావిస్తుంది. ఆ విద్యార్థి అనారోగ్యం తో ఉన్నాడు కనుక, తల్లి పంపనంటుంది. 'అనారోగ్యం వైద్యశాఖకు సంబంధించినది, నాది విద్యా శాఖ. అందువల్ల విద్యార్థిని తీసుకుపోతాన'ని టీచర్ అంటుంది. టీచర్‌కు ఆరోగ్యంతో సంబంధం లేదు. కానీ, తల్లి తమ బిడ్డ ఆరోగ్యాన్ని, చదువును అన్నింటినీ పట్టించుకుంటుంది. మానవ వనరుల అభివృద్ధి శాఖ ఒక తల్లి మాదిరిగా అన్ని అంశాలను పట్టించుకోవాలనేది రాజీవ్ జీ ఆలోచన.

కుమారుడు కావొచ్చు, కుమార్తె కావొచ్చు, ఒక శిశువుకు సంబంధించిన అన్ని అంశాలను పట్టించుకోవాల్సిందే. కుమారుడైతే బడికి పంపడం, కుమార్తెను బడికి వద్దనడం సరికాదు. అందువల్లనే బాలికా విద్యకు సంబంధించి ప్రత్యేక కృషి జరుపాలని నూతన విద్యా విధానం సూచిస్తుంది. మొదట విద్యారంగంలో వివక్ష తొలగాలి. విద్యారంగంలో వివక్షను నిర్మూలించినట్లయితే ఇప్పుడు మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు రూపుమాసిపోతాయని నాకు అనిపిస్తున్నది. అన్ని సమస్యలు మటుమాయమైపోతాయని నేననడం లేదు. కొన్ని నిబిడీకృతమైన సమస్యలుంటాయి. కానీ, మానవులతో సాధ్యమైనన్ని సమస్యలు పరిష్కరించవచ్చు. కొందరు తల్లిదండ్రులు కొడుకును బడికి పంపుతారు తప్ప, కుమార్తెను పంపరు. ఈ భావజాలం ప్రజల మనసులో నాటుకుపోయి ఉన్నది. మహిళా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నవారు తల్లిదండ్రుల్లో పరివర్తన తీసుకురావడానికి ప్రయత్నించాలి.

మహిళలు విద్యావంతులైతే, వారి రక్షణకు చట్టం కూడా చేసినట్లయితే, ఇక వారి హక్కుల కోసం వారే పోరాడుతారు. వారి హక్కుల కోసం వారు కాకుండా, మరెవ్వరు పోరాడుతారు? వారు పోరాడకుండా ఉండటం మంచిది కాదు. ఈ పోరాటం ఎంతోకాలం సాగదు. కొంతకాలానికి మగవారు కూడా దిగి వస్తారు. విద్యావంతులైన మహిళలు తమ సమస్యలను పరిష్కరించుకుంటారు. ఇప్పటికీ సమాజంలో అనేక మూఢ నమ్మకాలు పేరుకుపోయి ఉన్నాయి. సతీసహగమనం వంటి దురాచారాలు పాత కాలానికి సంబంధించినవి ఇంకా ఉన్నాయి. మహిళలు అయిష్టంగానే వీటికి బలవుతున్నారు. ఈ దురాచారం అమలులో ఉన్న ప్రాంతం గురించి నేను వివరాలు సేకరించాను. ఈ హీనమైన దురాచారాన్ని వారు గౌరవనీయమైనదిగా భావిస్తున్నారు. ఈ దురవగాహన ఉన్నంతకాలం స్త్రీల పట్ల ఈ దురాచారం కొనసాగుతూనే ఉంటుంది. దేవదాసీ విధానం మరో దురాచారం. దేవుడు కను క మాట్లాడగలిగితే మనం చేస్తున్న పనులకు తీవ్ర నిరసన వ్యక్తం చేసేవాడు. మనలాగా మరే సమాజం ఇంతగా దేవుడిని వాడుకొని ఉండదు. దేవుడిని అత్యంత దోపిడి చేస్తున్న వాడు మానవుడే.

రాజకీయాల్లో ఏమీ జరుగుతున్నదనేది చూస్తూనే ఉన్నాం. మూఢనమ్మకాలు మనుషుల్లో గాఢంగా నాటుకుపోయి ఉన్నాయి. మనిషికి మతం అనేది అవసరమే కానీ, మతం పేర అనేక నమ్మకాలు ఎంతో నష్టం చేస్తున్నాయి.

# వార్డు వాలంటీర్లు హద్దు మీరితే చర్యలు తప్పవు

## - జివిఎంసి కమిషనర్ / అదనపు ఎన్నికల ఆధారిటీ నాగలక్ష్మి



విశాఖపట్నం : రాష్ట్ర ఎన్నికల కమిషన్ వారికి వార్డు వాలంటీర్లపై పలు రాజకీయ పక్షాలు, మీడియా ప్రతినిధులు మరియు పబ్లిక్ నుండి పలు ఫిర్యాదులు వస్తున్నాయని, వారు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అతిక్రమించి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారని పలు ఫిర్యాదులు అందుతున్నందున, వార్డు వాలంటీర్లు అందరూ వారియొక్క సెల్ ఫోన్ లను వెంటనే సంబంధిత జోనల్ కమిషనర్ వారికి సరెండర్ చేయాలని, ఎవరైనా వాలంటీర్ లబ్ధిదారులను, గ్రూపు సభ్యులను కలసి ఓట్ల గురుంచి అడగవద్దని మరియు ఏ పోటీ దారునకు ఓట్లడిగి లబ్ధి చేకూర్చవద్దని కమిషనర్ నాగలక్ష్మి .ఎస్ ఆదేశించారు. జివిఎంసి పరిధిలో ఓటర్లకు విజ్ఞప్తి చేస్తూ ఎవరైనా వాలంటీర్లు ఎన్నికల ప్రవర్తనా నియమావళికి వ్యతిరేకంగా, ఎన్నికల ప్రచారంలో ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని పాల్గొనిన యెడల ఈ క్రింది తెలిపిన ఈ-మైల్స్ కు గాని, జివిఎంసి లో నిరంతరం పనిచేస్తున్న ఎన్నికల ఫిర్యాదుల విభాగంనకు ఫోన్ నెంబర్లు ద్వారా గాని, నేరుగా వచ్చి వ్రాతపూర్వకంగా జివిఎమ్ సి ప్రధాన కార్యాలయంలో ఏర్పాటైన ఎన్నికల విభాగం నందు ఫిర్యాదులు చేయవచ్చని కమిషనర్ పత్రికా ప్రకటన ద్వారా ఓటర్లకు సూచించారు.

సంబంధిత జివిఎంసి జోనల్ కమిషనర్లు అందరూ వెంటనే వార్డు వాలంటీర్ల వద్ద నుండి సెల్ ఫోన్ లను స్వాధీన పరచుకోవాలని కమిషనర్ ఆదేశాలిచ్చారు.

# సీఎం జగన్ సారథ్యంలో ప్రజా పాలన నడుస్తోంది

## - 56వ వార్డులో ఎంపీ విజయసాయిరెడ్డి పర్యటన



కంచరపాలెం : గ్రేటర్ విశాఖ 56 వ వార్డు కార్పొరేటర్ వైకాపా అభ్యర్థి ఆడారి శ్రీనివాసరావు ను గెలిపించి వార్డు అభివృద్ధి బాటలు బాటలు వేసుకోవాలి. అవినీతి రహిత పాలన, సంక్షేమ అభివృద్ధి పాలన, సుపరిపాలన, అన్నింటినీ మించి ప్రజా పాలన ప్రస్తుతం జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో నడుస్తుంది. ఆంధ్రప్రదేశ్ ను అన్నివిధాలుగా అభివృద్ధి చేసుకోడానికి జగన్మోహన్ రెడ్డిని మరో 25 సంవత్సరాలు ముఖ్యమంత్రి పీఠంపై కొనసాగించు కోవలసిన బాధ్యత రాష్ట్ర ప్రజలపై ఉంది. గత ప్రభుత్వ హయాంలో ఇంటిపన్ను బకాయిలపై పెనాల్టీ ని రద్దు చేసే విషయమై ప్రభుత్వం పరిశీలిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 1400 కోట్లు పెనాల్టీ రూపంలో చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం అతిత్వరలో ప్రజలపై అదనపు భారం తొలగిస్తూ నిర్ణయం తీసుకుంటుంది. గోకుల్ నగర్లో ప్రత్యేకించి మహిళల కోసం కమ్యూనిటి హాలు, తోట వీధి ప్రజలకోసం ఓ కమ్యూనిటి హాల్ నిర్మించే ఏర్పాటు చేస్తాం.

ప్రభుత్వ స్థలంలో చిన్న చిన్న ఇల్లు నిర్మించు కొని ఎల్ల తరబడి నివసిస్తున్న వారి ఇళ్లను రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చారు.

# వార్డు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి వార్డు సంక్షేమానికి కృషి చేస్తాను

## జీవీఎంసీ 27వ వార్డు తెలుగుదేశం కార్పొరేటర్ అభ్యర్థి గోలగాని వీరారావు (బుజ్జి) హామీ




విశాఖపట్నం : వార్డు ప్రజలకు నిత్యం అందు బాటులో ఉండి వార్డు సంక్షేమానికి కృషిచేస్తానని జీవీఎంసీ 27వ వార్డు తెలుగుదేశం కార్పొరేటర్ అభ్యర్థి గోలగాని వీరారావు(బుజ్జి) హామీ ఇచ్చారు.శనివారం విశాఖలో మాజీ ముఖ్యమంత్రి,తెలుగుదేశం అధినేత చంద్రబాబు అభ్యర్థు లకు మద్దతుగా నిర్వహించిన రోడ్ షో లో పాల్గొన్న వీరారావు మాట్లాడుతూ అధినేతకు వార్డు నాయకులు, కార్యకర్తలు,అభిమానులు దాదాపు పదిహేను వందల మందితో స్వాగతంపలికామని తెలిపారు.స్థానికుడిగా తనకు వార్డు సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉందన్నారు. దీర్ఘకాలికంగా వార్డు లో ఉన్న సమస్యలను తొలగించడమే ప్రధాన ఎజండా గా పనిచేస్తానని తెలిపారు.వార్డు ప్రజలు విశేషంగా ఆదరిస్తున్నారని తన గెలుపుపై వీరారావు పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారు.

# కవి సమయం

## పల్లలే సౌభాగ్యాలంట

పెంచిన తల్లి పంచుల్లో వుంది
కనికారం కడవల్నిండా వుంది
కంచాల్లో తిండి పుష్టిగా తినమంటుంది
పల్లెల్లో ఆమాటుంది.
పండగ, పబ్బం - ఇంటింట
ప్రతి యింట - చుట్టాలంట
పల్లె సంపద - బతుకులు పంట
ఇంటింట - ఆనందాలంట.
పద్యం చదివితే...
మళ్ళీ, మళ్ళీ ఫలకాలంటు
ఈలలుతో ఉత్సాహలెంతెంతో
పౌరాణిక నాటకాలు పల్లెల్లో యింకెంతో
బతుకులు బాట - పల్లె, పేటల్లో
దానాలకు చల్లని - చేతుల్లు
చేతార నిండంట
చేతార పెట్టినవాడు
పల్లె, పేటంట.
పల్లె, పేటలు, కళకళలాడే రోజులు వస్తున్నాయ్
పల్లెలు కేమి కొరదే లేదని పిద్దాం
చూడముచ్చటగ - పల్లెలు- అనిపిద్దాం
గాంధీ చెప్పిన మాటలు
పల్లె, పేటలు సౌభాగ్యలంట.

... కవితా రచన
మజ్జి శ్యామసుందరరావు

# పంచాంగం

| మాసం : మాఘు; తిథి : నవమి రా.7.31; మూల రా.11.32; వ.ఉ.8.23ల 953;వ.రా.10.01ల 11.31. | ఆదివారం 07-03-2021 |
| --- | --- |

a **మేషం** : ఉపాధ్యాయులకు పై అధికారుల నుంచి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. ఆత్మవిశ్వాసంతో సవాళ్ళను ఎదుర్కొంటారు. ఉద్యోగ భద్రత వల్ల భవిష్యత్ పట్ల భరోసా వస్తుంది. రాబోయే ఆదాయానికి తగినట్టుగా ప్రణాళికలు రూపొందించుకుంటారు. b **వృషభం** : బంధువుల విషయంలో తలదూర్చడం కంటే మీ పనులు మీరు చేసుకోవడం మంచిది. మీ సంతానం మీ మాటను గౌరవిస్తారు. మీ సంతానంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడుపుతారు. స్త్రీలకు ప్రకటనలు, స్కీముల పట్ల అవగాహన అవసరం. **మిథునం** : దీర్ఘకాలంగా కోర్టులో ఉన్న కేసు ఒకటి మీకు ఊరట నిస్తుంది. స్త్రీలు గృహోపకరణాలు కొనుట పట్ల ఆసక్తి చూపుతారు. రాబడికి తగినట్లుగా ఖర్చులు ఉంటాయి. దైవ కార్యాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. తొందరపాటు నిర్ణయాల వల్ల కష్టనష్టాలు చవి చూడాల్సి వస్తుంది. d **కర్కాటకం** : వృత్తుల వారు ఆర్థికంగా నిలదొక్కు కుంటారు. సాహస ప్రయత్నాలు విరమించండి. పలుకుబడి ఉన్న వ్యక్తులతో పరిచయాలేర్పడతాయి. కుటుం బీకుల కోసం ధన బాగా వ్యయం చేస్తారు. ఉద్యోగస్తులు సమర్థంగా పనిచేసి పై అధికారులను మెప్పిస్తారు. e **సింహం** : పత్రిక, ప్రింటింగ్ రంగాల వారికి ఓర్పు, అంకితభావంతో శ్రమించాల్సి ఉంటుంది. స్త్రీలకు పనివారతో ఇబ్బందులు తలెత్తుతాయి. మీరు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న మిత్రులను కలుసుకుంటారు. చేతివృత్తుల వారికి సదావకాశాలు లభిస్తాయి. విద్యార్థుల ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండటం మంచింది. f **కన్య** : ఇంటా బయట అధిక కృషి అనంతరం మంచి ఫలితాలను పొందుతారు. కొబ్బరి, పండ్ల, పూల, చిరు వ్యాపారులకు కలిసి రాగలదు. స్త్రీలకు ఆర్జనపట్ల ఆసక్తి, అందుకు అనువైన పరిస్థితులు నెలకొంటాయి. నిరుద్యోగులు వచ్చిన అవకాశాలను చేజార్చు కుంటారు. g **తుల** : నూతన టెండర్ల విషయమై ప్రముఖులతో సంప్ర దింపులు జరుపుతారు. రాజకీయ నాయకులు తరచూ సభలు, సమావేశాల్లో పాల్గొంటారు. స్త్రీలకు ఆరోగ్యకరమైన సంప్రదింపులు జరుపుతారు.. h **వృశ్చికం** : రుణాలు తీరుస్తారు. మీ సంతానం వివాహం, విద్య విషయాల పట్ల ప్రత్యేక శ్రద్ధ కను పరుస్తారు. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. పోస్టల్, ఎల్.ఐ.సి ఏజెంట్లకు ఆర్థికంగా బాగుంటుంది. i **ధనుస్సు** : ధన వ్యయంలో ఏకాగ్రత వహించండి. ఉద్యోగస్తులకు పనిభారం, విశ్రాంతి లోపం వంటి చికాకులు అధికంగా ఉంటాయి. దైవ, సేవా కార్యక్రమా లకు సహాయ సహకారాలు అందిస్తాయి. నిరుద్యోగులకు ఉపాధి పథకాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. వస్త్ర, బంగారు, ఫ్యాన్సీ, పచారీ వ్యాపారులకు సంతృప్తి, పురోభి వృద్ధి. j **మకరం** : గృహ మార్పులు, మరమ్మతులు అనుకూలిస్తాయి. స్త్రీల, ఆలోచనలు, అభిప్రాయాలకు మంచి స్పందన లభిస్తుంది. k **కుంభం** : వాహనం విలువైన వస్తువులు ఇతరులకిచ్చే విషయంలో లౌక్యంగా మెలగండి. విద్యార్థులు క్రీడలు, క్విజ్ పోటీల్లో రాణిస్తారు. గృహ నిర్మాణాలలో స్వల్ప అడ్డంకులు, చికాకులు ఎదుర్కొంటారు. L **మీనం** :సత్కాలం ఆసన్నమైంది, మీ ఆలోచనలు, పథకాలు అమలు చేయండి. అనుకున్న పనులు ఆశించినంత చురుకుగా సాగవు. ఉద్యో గస్తులు యూనియన్ కార్య కలాపాల్లో తలమునకలై ఉంటారు. నిరుద్యోగులు చేపట్టిన ఉపాధి పథకాలకు మంచి స్పందన లభిస్తుంది.



# సంకీర్తన

## శుభ ఫలితాలనిచ్చే సుబ్రమణ్యస్వామి

ఒకే శరీరంలో ఆరుముఖాలు పన్నెండు చేతులు గల కార్తికేయునికి సహాయకులుగా పార్వతిదేవి నూపురం నుంచి తొమ్మిది మంది వీరులు జనించారు. వీరబాహు, వీరకేసరి, వీర మహేంద్ర, వీర మహేశ్వర, వీర పురంధర, వీర రాక్షస, వీర మార్తాండ, వీరాంతక, వీర ధీర అని వారిని పిల్వడం జరుగుతోంది. విష్ణు ఆదేశం మేరకు శివుడు ఆ బాలుని నుంచి ప్రణవోపదేశం పొందాడు. ఆ కారణంగా సుబ్రహ్మణ్యేశ్వరుడికి, శివగురు, స్వామినాథ, దేశిక అనే పేర్లు వచ్చాయి. కుమారస్వామి ఇంద్రుని కుమార్తె అయిన దేవయానిని, శివమూర్తి కుమార్తె వల్లీదేవిని వివాహమాడాడు. అలాగే ఆ స్వామి నెమలిన తన వాహనంగానూ, కోడి పుంజును తన ధ్వజంగానూ చేసుకున్నాడు. ఆ కారణంగా స్వామి శిఖివాహనుడు, కుక్కుట ధ్వజుడయ్యాడు. సుమ్రహ్మణ్వేశ్వ రుడి ధ్వజమందు కోడి పుంజు ఉంటుంది. కో అనే ధ్వని ప్రణవమును సూచిస్తుంది. జ్ఞాన భానూదయము నకు ధ్వని సంకేతం. అలాగే స్వామి వాహనమైన నెమలి పురివిప్పి నర్తించునపుడు ఓంకార రూపంలో ఉంటుంది. ఆ కారణంగా స్వామిని ప్రణవ స్వరూపుడిగా చెబుతారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని సేవించే సమయంలో ఉరగేశ్వ రాయనమః మహోరణాయనమః అని కీర్తించడం జరుగుతోంది. వల్లీదేవి స్వరూపంలో ఉన్నదని, స్వామి కూడా సర్ప రూపంలో ఉంటాడని పురాణాల ద్వారా అవగతమవుతోంది.తెలుగు రాష్ట్రాలలో సుబ్రహ్మణ్య షష్టి పర్వదినాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపు కుంటారు. ముఖ్యంగా మహిళలు, పిల్లలు ఈ పర్వదినం రోజున స్వామికి ఘనంగా పూజలు నిర్వహిస్తారు. సుబ్రహ్మణ్య షష్టిరోజున వేకువజామునే నిద్రలేచి తలంటు స్నానం చేస్తారు. అనంతరం సుబ్రహ్మణ్యేశ్వరునికి సమర్పించడానికి చిలీ (నువ్వులు, బెల్లంతో కలగలిపినది) తయారుచేసి, కొబ్బరికాయలు, అరటిపళ్ళు, పాలు, కోడిగుడ్లతో బయలుదేరుతారు. సుబ్రహ్మణ్యే శ్వరుడు సర్పాకారుడు కావడంవల్ల సమీప ప్రాంతాలలో ఉన్న పుట్టలకు చేరుకుని పుట్టను శుద్ధిచేసి, పసుపు, కుంకుమ బొట్లు, అందమైన ముగ్గులతో అలంకరిస్తారు. అనంతరం, పాలు కోడి గుడ్లను పుట్టలలోవేసి, ప్రసాదాలను, కొబ్బరి కాయలను నివేదిస్తారు. స్వామిని భక్తితో పూజిస్తూ, భజన గీతాలు, భక్తి పాటలతో కీర్తిస్తారు. అనంతరం పుట్ట మన్నును తమ చెవులకు రాసుకుంటారు. అలా చేయడంవల్ల తమకు చెవికి సంబంధించిన వ్యాధులు దరిచేరవని నమ్ముతారు.అలాగే మహిళా భక్తులు, పుట్టలో పాలుపోసి, పుట్ట చుట్టూ భక్తి శ్రద్ధలతో ప్రదక్షిణలు చేస్తారు. సంతాన ప్రాప్తికోసం స్వామిని మనసావాచా ఆరాధిస్తారు. పిల్లలు, స్వామికి ప్రణామాలు అర్పించి మందుగుండు సామాను కాలుస్తారు. అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే సుబ్రహ్మణ్య ఆరాధన శక్తిని, ఐశ్వర్య మహద్భా గ్యాలను కల్గిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. ఆ సుబ్రహ్మణ్యే శ్వరుని అపార కృపా రసామృతం అందరిమీదా వెల్లివిరియాలని మనసావాచా అందరూ పూజిస్తారు.

శివపార్వతుల తనయుడైన కుమారస్వామి గంగాదేవి గర్భంలో పెరిగాడు. ఆమె భరించ లేకపోవడంతో, ఆ శిశువు రెల్లుపొదల్లో జారిపడింది. ఆ శిశువును కృత్తికా దేవతలు ఆరుగురు స్తన్యమిచ్చి పెంచారు. జారిపడినందున ఆ శిశువునకు స్కందుడని, రెల్లుగడ్డిలో ఆవిర్భవించడంతో శరవణుడని, కృత్తికా దేవతలు పెంచడంతో కార్తికేయుడని కుమారస్వామి అని పిలు స్తారు. ఇక సుబ్రహ్మ ణ్యునికి ఉన్న ఆరుముఖాలకు ప్రత్యేకతలు ఉన్నాయి. మయూర వాహనాన్ని అధిరోహించి కేళీ విలాసాన్ని ప్రదర్శించే ముఖం, పరమేశ్వరునితో జ్ఞానచర్చలు జరిపి ముఖం, శూరుడనే రాక్షసుని వదించిన స్వరూపానికి ఉన్న ముఖం, శరణు కోరిన వారిని సంరక్షించే ముఖం, శూలాయుధ పాణియై వీరుడిగా ప్రస్ఫు టమయ్యే ముఖం, లౌకిక సంపదల్ని అందించే ముఖం ఇలా ఆరు ముఖాల స్వామిగా ఆనందదాయ కుడిగా స్వామి కరుణామయుడిగా భక్తులచే నీరాజనాలు అందు కుంటున్నాడు. అందుచేత ఆషాడ మాస శుక్లపక్ష పంచమి, షష్టి పుణ్యదినాల్లో భక్తులు స్వామిని విశేషంగా సేవిస్తారు. వీటిని స్కందపంచమి, కుమార షష్టి పర్వదినాలు జరుపుకుంటారు. స్కంద పంచమి, షష్టి రోజుల్లో శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామిని భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తే సకల సంపదలు, సుఖవంతమైన జీవితం చేకూరుతుందని పురో హితులు చెబుతున్నారు.

# బాధ్యతాయుతంగా ఎన్నికల విధులను నిర్వహించండి

- సమయపాలన పాటించండి...
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు - ఈ నెల 9న పోలింగ్ సామాగ్రి పంపిణీ
- 10 న పోలింగ్,14 న ఓట్ల లెక్కింపు.... జిల్లా అదనపు ఎన్నికల అధికారి మరియు సబ్ కలెక్టర్ ఎన్ మౌర్య....



నర్సీపట్నం : మున్సిపల్ ఎన్నికలను బాధ్యతాయుతంగా నిర్వహించాలని జిల్లా అదనపు ఎన్నికల అధికారి మరియు సబ్ కలెక్టర్ ఎన్ మౌర్య స్పష్టం చేశారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలింగ్ అధికారులకు, సహాయ పోలింగ్ అధికారులకు ఎన్నికల నిర్వహణ పై రెండవ విడత శిక్షణా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ అధికారులను రాష్ట్ర ఎన్నికల కమిషన్ నియమించిందని విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ఈనెల 9వ తేదీన ఎన్నికల సామాగ్రిని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పంపిణీ చేస్తారని, వాటిని సకాలంలో సేకరించి నిర్దిష్టమైన సమయానికి సంబంధిత పోలింగ్ కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఎన్నికల అధికారులు రాష్ట్రఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో సేవలను అందిస్తున్నారని క్రమ శిక్షణ తో ప్రవర్తించాలనన్నారు. ఎన్నికల నియమావళికి సంబంధించిన హ్యాండ్ బుక్ ను చదివి పూర్తి అవగాహనతో ఎన్నికలను నిర్వహించాలన్నారు. ముందుగా ఎన్నికల సామాగ్రి క్షుణ్ణంగా తనిఖీ చేసి, లోపాలుంటే సంబంధిత జోనల్ అధికారులకు సమాచారం అందిస్తే అవసరమైన సామాగ్రిని సరఫరా చేస్తారన్నారు. మార్చి పదో తేదీ ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ప్రక్రియను జాగ్రత్త గా నిర్వహించాలన్నారు. మార్చి 14వ తేదీ ఉదయం 7 గంటల నుండి ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని ఎటువంటి పొరపాట్లు లేకుండా ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించి, విజయవంతం చేయాలన్నారు శిక్షణా తరగతులకు ఆలస్యంగా వచ్చిన ఎన్నికల అధికారులకు మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఎలక్షన్ అథారిటీ మరియు మునిసిపల్ కమిషనర్ ఎన్ కనకారావు మాట్లాడుతూ పురపాలక ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేశామన్నారు. ఎటువంటి పొరపాట్లు జరగకుండా ఎన్నికలు నిర్వహించాలన్నారు. పి ఓ డైరీ సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. పోలింగ్ ప్రక్రియ రహస్యంగా జరగాలన్నారు. ప్రిసైడింగ్ అధికారుల విధులు, బాధ్యతలు, బ్యాలెట్ పేపర్లు , టెండర్ బ్యాలెట్ , బ్యాలెట్ బాక్సుల సీల్ వేయు విధానంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. శిక్షణా కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు బీ ఎస్ ఆర్ గోవింద, సుగుణ, పి వో లు, ఏ పి వో లు, ఈ వో లు తదితరులు హాజరయ్యారు.

# రాంపల్లి పంచాయతీ గిరిజన గ్రామాలలో మలేరియా విజృంభన







అనంతగిరి : మండలంరొంపల్లి చొట్టాడువలస, కరకవలస గ్రామాల్లో మలేరియా స్వైర విహారం మొదలైంది. ఇప్పటికే స్థానికులు మలేరియా జ్వరాల భారిన పడినట్లు తెలిపారు. మూడు మలేరియా పాజిటివ్ కేసులు నమోదైనట్లు డా సతీష్ తెలిపారు. రెండు గ్రామాల్లో డా, సతీష్ పర్యవేక్షణలో మలేరియా నివారణకు మందులు పిచికారీ చేశారు. స్థానిక సర్పంచ్ చిరంజీవి పరిస్థితిని సమీక్షించారు. భీమవరం నుండి వైద్య బృందం వచ్చి స్థానికులకు వైద్య సేవలు అందిస్తున్నారు. నీటి కలుషితం కారణంగా వ్యాధి ప్రభలుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఇప్పటికైనా గెడ్డలో నీటిని వాడడం వలన మలేరియా బారిన పడుతున్నామని ప్రభుత్వం స్పందించి మంచి నీరు సౌకర్యాన్ని కల్పించాలని ఇదివరకు వేసిన పైపు లైన్లను సరిచేయాలని గిరిజనులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదిలా ఉండగా స్థానిక అంగన్వాడి పాఠశాల ఉపాధ్యాయురాలు ప్రభావతి పిల్ల కోసం తన సొంత మొత్తం తో మంచి నీటి సదుపాయం కల్పించడంతో స్థానికులుఆమెను అభినందనలుతెలుపుతున్నారు,.

# దేశం పార్టి అధినేత చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసిన సర్పంచ్ సత్యనారాయణ



పాడేరు : విశాఖ పట్నంలో జరుగుతున్న జివిఎంసి ఎన్నికల ప్రచారంలో భాగంగా విచ్చేసినా తెలుగుదేశం పార్టీ అధినేత, పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడుని హుకుంపేట మండలం, అండిబ గ్రామ పంచాయతీలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందినసర్పంచ్'తామర్ల. సత్యనారాయణ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. తెలుగు దేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు వారితో ముచ్చడిస్తూ చాలాసంతోసమని, పార్టీ అభివృదికి, బలోపేతం చేయడానికి మీలాంటి యువత.. (సత్యనారాయణని ఉద్దేశిస్తూ)ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. పార్టీని నమ్ముకున్న వారికి నేను ఎప్పుడు అండగా ఉంటానని భరోసా ఇచ్చారని తాటాకు చప్పుడ్లకు భయపడాల్సిన అవసరం లేదని కొండంత ధైర్యం ఇచ్చారని విలేకర్లకుఫోన్ ద్వారా తెలియజేశారు. సత్యనారాయణతో పాటు టిఎన్ఎస్ఎఫ్, రాష్ట్రఅధ్యక్షుడు ప్రణవ్ 'గోపాల్' సెక్రెటరీ పూజరాణి,ప్రవీణ్' నందీప్ తదితరులు పాల్గొన్నారని తెలిపారు.

# ఐదు సంవత్సరాలు తెలుగుదేశం పార్టీ భీమిలికి ఏ అభివృద్ధి చేయలేదు : మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: జీవి ఎం సి భీమిలి జోన్ మూడవ వార్డ్ ఎన్నికల్ల ప్రచారంలో భాగంగా శనివారం కృష్ణా కోలని నుండి చిన్న బజార్ వరకు ర్యాలీ నిర్వహిం చారు. మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ 6 కోట్ల 50 లక్షల తో భీమిలిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని అధికారంలో ఉన్న ఐదు సంవత్సరాలు తెలుగుదేశం పార్టీ భీమిలికి ఏ అభివృద్ధి చేయ లేదని తెలియజేశారు. మాజీ మంత్రి పసుపులేటిబాలరాజు మాట్లాడుతూ విద్యాధికురాలు రాజకీయం నేపథ్యం కుటుంబం నుండి వచ్చిన భారతి ని గెలిపించి నట్లయితే మరింత అభివృద్ధి జరుగుతుందని తెలియజేశారు.మైలపల్లి భారతి మాట్లాడుతూ చారిత్రాత్మక భీమిలి ఎప్పటికీ పూర్వచరిత్ర నెమరు వేసుకుంటున్న ఈ భీమునిపట్నం అభివృద్ధిలో అవంతి ఆశీస్సులతో చరిత్రను పునరావృతం అయ్యేటట్లుగా మూడవ వార్డు అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలని మీ అందరికీ హామీ ఇస్తున్నాను అని తెలియజేశారు. జరగబోయే ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైలపల్లి షణ్ముఖ రావు, కొండ్రు రామ సూరప్పడు, పిన్నింటీ ఎర్రయ్యరెడ్డి, అప్పికొండ. అప్పలనాయుడు, రాంభుక్త ప్రభాకర్ నాయుడు, బోనీ సంజీవరావు,కె. నాగేంద్ర , సి.హెచ్.గౌరీ నాయుడు ,అల్లిపిల్లి నర్సింగ రావు, వాసు పల్లి కొండ బాబు,వాసు పల్లి ఎల్లా జీ రావు (రంగ), ఎం రాము ,వి కోదండ తదితరులు పాల్గొన్నారు.



# మునిసిపల్ ఎన్నికలలో వాలంటీర్లు పాల్గొంటే వారిపై కఠిన చర్యలు..

**జిల్లా అదనపు ఎన్నికల అధికారి మరియు నర్సీపట్నం సబ్ కలెక్టర్ ఎన్ మౌర్య..**

నర్సీపట్నం : మున్సిపల్ ఎన్నికల విధులలో వార్డు వాలంటీర్లు ప్రచారం చేస్తే రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం వారిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా అదనపు ఎన్నికల అధికారి మరియు నర్సీపట్నం సబ్ కలెక్టర్ మౌర్య హెచ్చరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ వార్డులలో వాలంటీర్లు ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థుల తో కలసి ప్రచారం చేస్తున్నట్లు తమ దృష్టికి వస్తే ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఫిర్యాదులకు సంబందించి మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేయడం జరిగిందని ఫిర్యాదులను నమోదు చేసుకొని చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

84650 13255, 089322 95588 నంబర్లను 24/7 అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు.

# కేశవ స్వామి వారి ఆలయంలో నేడు అన్నదానం

చోడవరం : పట్టణంలోని అతి పురాతన దేవాలయం శ్రీదేవి, భూదేవి, సమేత కేశవ స్వామి వారి ఆలయం లో స్వామివారి కల్యా ణోత్సవం ముగింపు కార్యక్రమంలో భాగంగా....

నేడు (ఆదివారం) భక్తులకు, భాగవతులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు సుదర్శనం రామకృష్ణ చార్యులు, సుదర్శనం సీతారామాచార్యులు తెలిపారు.

స్వామివారికి విశేష పూజలు అనంతరం మధ్యాహ్నం ప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు.



*పెద్దాపురం టౌన్ మెయిన్ రోడ్డు లో మున్సిపల్ ఎన్నికల ప్రచారం లో పాల్గొన్న రాష్ట్ర ఉపముఖ్య మంత్రి వర్యులు మరియు రాష్ట్ర రెవిన్యూ శాఖ మాత్యులు, తూర్పు గోదావరి జిల్లా ఇంచార్జ్ మినిస్టర్ ధర్మాన కృష్ణ దాస్, ఎంపీ వంగా గీత, నియోజకవర్గ ఇంఛార్జ్ దవులూరి దొరబాబు*

# ఎన్నికల ప్రచార జాతా వాహనాలు ప్రారంభం



పెద్దాపురం : ఎన్నికల ప్రచారజాతా కు సంబందించిన ప్రచార వాహనాలను రొంగల తాతారావు జెండా ఊపి ప్రారంభించారు. ఎన్నికల ప్రచారం కోసం 14,15,18,21 వార్డులోకి ప్రచార వాహనాలు యాసలపు సూర్యారావు భవనం నుండి బయలుదేరాయి. నిరంతరం ప్రజల కోసం పని చేసే సిపిఎం అభ్యర్దులను గెలిపించాలని కోరారు. నిస్వార్ధంగా కార్మికుల కోసం, రైతుల కోసం సిపిఎం మాత్రమే పోరాడుతుందని అన్నారు. ఈ కార్సక్రమంలో 14వ వార్డు సిపిఎం అభ్యర్ధి రొంగల సుబ్బలక్ష్మీ, 15వ వార్డు అభ్యర్ధి యాసలపు అనంత లక్ష్మి, 18వ వార్డు అభ్యర్ధి కూనిరెడ్డి అరుణ, 21వ వార్డు అభ్యర్ధి నీలపాల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



*పూర్ణ మార్కెట్ దుర్గాలమ్మ గుడి వద్ద బహిరంగ సభలో శనివారం 39వ వార్డు టీడీపీ కార్పొరేటర్ అభ్యర్ధి వాసుపల్లి దానయ్య అలియాస్ దానేశ్ ను ఓటర్లకు పరిచయం చేస్తున్న టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.*

# ఉప్పుటేరును కలుషితం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి



అచ్యుతాపురం : పూడిమడక గ్రామంలో ఉప్పుటేరును కలుషితం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని శ్రీ స్వామి వివేకానంద వికలాంగుల అసోసియేషన్ అధ్యక్షుడు మేరుగు నూకరాజు కోరారు. శనివారం ఆయన ఉప్పుటేరు కలుషితంపై తహశీల్దార్, ఫిషరీస్ అధికారిణికి వినతిపత్రం అందజేశారు.

ఈ కార్యక్రమంలో కె కాసుబాబు, అప్పలరాజు, సన్యాసిరావు వెంకటేష్ తదితరులు ఉన్నారు.

### మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై పోలింగ్ సిబ్బంది

# పిఓలు, ఏపీవోలు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలి

### అసిస్టెంట్ ఎలక్షన్ అథారిటీ మరియు మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర




పెద్దాపురం : మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై పోలింగ్ సిబ్బంది పిఓలు, ఏపీవోలు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని అసిస్టెంట్ ఎలక్షన్ ఆదారిటి మరియు మునిసిపల్ కమిషనర్ జంపా సురేంద్ర పేర్కొన్నారు. శనివారం స్థానిక పెద్దాపురం బచ్చు నాగరత్నమ్మ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ భవన సామావేశ మందిరంలో ఉద యం పెద్దాపురం పుర పాలక సంఘం సాధారణ ఎన్నికలు పోలింగ్ సిబ్బంది పిఓలు, ఏపీవోల రెండవ దశ శిక్షణ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ ప్రారంభించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ పై ప్రతి పోలింగ్ సిబ్బంది పిఓలు, ఏపీవోలు పూర్తి స్థాయిలో అవగాహన కలిగివుండాలని, ఎన్నికల నిర్వహణ, బ్యాలెట్ బాక్స్ ల పనితీరు, బ్యాలెట్ పాత్రలపై పూర్తిస్థాయిలో సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు.అదేవిధంగా మొదటి దశ శిక్షణా కార్యక్రమంలో తెలుసుకున్న విషయాలతో పాటు, ఈ శిక్షణ లో కూడ సందేహాలను, నివృత్తి చేసుకోవాలని అన్నారు. పెద్దాపురం పురపాలక సంఘం నిర్వహించే మునిసిపల్ ఎన్నికలలో 71 మంది ప్రిసైడింగ్ అధికారులు, 76 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు మరియు పూర్తిస్థాయిలో ఇతర శాఖల అధికారులు ఉన్నారన్నారు. మొత్తం 29 వార్డులకు 40563 ఓటర్లు ఉన్నారన్నారు.అదేవిధంగా పోలింగ్ ప్రక్రియలో పివోలు, ఏపీవోలు తగిన జాగ్రత్తలు తీసుకోవడంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎన్నికల విధులలో ఎటువంటి నిర్లక్ష్యం వహించ కుండా, అప్రమత్తంతో విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మేనేజర్ ఎస్. నాగేశ్వరరావు, ఆర్. ఐ.యం. నాగేశ్వరరావు, శానిటరీ ఇన్స్పెక్టర్ డేవిడ్ రాజు, శిక్షణ ట్రైనర్లసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధురాలు ఆత్మహత్య



భీమునిపట్నం : కుటుంబ కలహాలు కారణంగా వృద్దురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన స్థానిక తగరపువలస లో జరిగింది. ఎస్.ఐ సంతష్ కుమార్ కథనం ప్రకారం తగరపువలస దరి అలంకా వారివీధికు చెందిన అప్పలసూరమ్మ(77) ఇంట్లో గతకొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపధ్యంలో అప్పలసూరమ్మ మనస్థాపం చెంది శుక్రవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళిపోయింది. కాగా సాయంత్రం గుడివాడ బ్రిడ్జి కింద మహిళ మృతదేహం ఉన్నట్లు కొందరు పోలీసులు కు సమాచారం అందించారు. ఆ సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి, అప్పలసూరమ్మ కుటుంబ సభ్యులకు ఆమె మృతి చెందినట్లు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం భీమునిపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్.ఐ సంతోష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కోలపర్తి అరుణ గెలుపు - అభివృద్ధికి మలుపు

### రాజ్యసభ సభ్యులు నరసింహారావు



అనకాపల్లి : భారతదేశాన్ని అత్యున్నత స్థానంలో నిలపడ మనేది బీజేపీతోనే సాధ్యమని రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావు పేర్కొన్నారు. భారతీయ జనతాపార్టీ ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి కోలపర్తి శ్రీను సతీమణి 84 వ వార్డ్ బీజేపీ కార్పొరేటర్ అభ్యర్థి అరుణ కుమారిని గెలిపిస్తే అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రధాని మోడీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి నడుం బిగించింది అన్నారు. అనకాపల్లిలో కొత్తూరు నర్సింగరావు పేట, సిరసపల్లి లో బిజెపి నాయకులతో కలిసి పర్యటించారు. బిజెపి జనసేన ఉమ్మడి అభ్యర్థి కోలపర్తి అరుణకు మద్దతుగా పర్యటించారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి తెలుగుదేశం,వైసిపి ఆటంకంగా నిలిచాయని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధి ప్రత్యేకంగా స్మార్ట్ సిటీ అమృత పథకం కింద విశాఖ పట్టణం అభివృద్ధి చేయడంలో బిజెపి ముందుందన్నారు. బిజెపి జనసేన పార్టీ అభ్యర్థులను గెలిపించుకుంటే ప్రజలకు మేలైన సేవలు లభిస్తాయన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు డాక్టర్ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శులు పరమేశ్వరరావు, చదరం నాగేశ్వరరావు,, కర్రి రామకృష్ణ, భక్త సాయిరాం, తాడి రామకృష్ణ, మంగా ఈశ్వర్, స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

# విభాగాలను తనిఖీ చేసిన ఆంధ్రవిశ్వవిద్యాలయం ఆర్ట్స్ ప్రిన్సిపాల్



విభాగాలను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ రాజేంద్ర కర్మార్కర్

ఏయూ : కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి. రాజేంద్ర కర్మార్కర్ శనివారం ఉదయం పలు విభాగాలను తనిఖీ చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో స్ట్రాంగ్ రూమ్ లుగా వినియోగిస్తున్న విభాగాలలో జరుగుతున్న పనులను గమనించారు.

తరగతి గదులను ఎన్నికల సంఘానికి ఇవ్వడం జరిగిందని ఈ నెల 15వ తేదీ నుంచి తరగతులు నిర్వహిస్తామన్నారు.

కార్యక్రమంలో పాలక మండలి సభ్యురాలు ఆచార్య టి. శోభశ్రీ, జర్నలిజం విభాగాధిపతి ఆచార్య డి.వి.ఆర్ మూర్తి, డాక్టర్ చల్లా రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణ కుమారిని గెలిపించండి - మాజీ ఎమ్మెల్యే పీలా



అనకాపల్లి : 81 వ వార్డు టీడీపీ కార్పోరేటర్ అభ్యర్థి మళ్ల కృష్ణకుమారిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్య నారాయణ అన్నారు. శనివారం 81 వ వార్డు పరిధి రాము నాయుడు కోలనీలో టీడీపీ అర్బన్ జిల్లా ఉపాధ్యక్షులు మళ్ల సురేంద్ర ఆద్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ మళ్ల సురేంద్ర, కృష్ణకుమారి గత 25 ఏళ్లుగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారని, అటువంటి వారిని గెలిపించుకుంటే వార్డు మరింత అభివృద్ధి జరుగుతుందని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వం హాయంలో అభివృద్ధి జరిగిందని, గత 22 నెలలుగా వైసీపీ ప్రభుత్వంలో అనకాపల్లి పట్టణ అభివృద్ధి జరగలేదని అన్నారు. తెలుగుదేశంపార్టీ తోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. తమ అమూల్యమైన ఓటును కృష్ణకుమారికి వేసి గెలిపించాలని కోరారు.

# గిరిజనుల హక్కులు చట్టాలను పటిష్టం గా అమలు చేయాలి

### ఐటీడీఏ పిఓ డా.వెంకటేశ్వర్




పాడేరు: గిరిజన ప్రాంతంలో పీసా చట్టం నిబంధను,1/70చట్టలను పరిగణనలోకి తీసుకొని చట్టాలను పటిష్ఠంగా అమలు పరచాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి డాక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. శనివారం స్థానిక కాపీ హౌస్ లో పీసా చట్టం ,ఎల్ టి ఆర్ చట్టం పై శిక్షణ కార్యక్రమం లో ఆయన మాట్లాడుతూ పీసా చట్టం, ఎల్ టి ఆర్ చట్టాల పై పూర్తి అవగాహన పెంచుకోవాలని పంచాయతీ సెక్రటరీ లకు, వీఆర్వోలకు సూచించారు. గిరిజన ప్రాంతంలో 1/70 చట్టం అమలులో ఉన్న కారణంగా గిరిజన ప్రాంతాల భూములను గిరిజనే తరులకు అన్యాక్రాంతం కాకుండా చూడాలని వీఆర్వోలకు ఆదేశించారు. షెడ్యూలు ప్రాంతంలోని పనిచేసిన ఉద్యోగులు గిరిజన చట్టాలపై అవగాహన చేసుకొని పటిష్టంగా చట్టాలను అమలు పరచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ న్యాయ సలహాదారు డాక్టర్ పల్లా త్రినాథరావు మాట్లాడుతూ ఎల్ టి ఆర్ 1/70 చట్టం కింద గిరిజన హక్కులకు పీసా చట్టం క్రింద గ్రామ సభల నిర్వహణకు సంబంధించిన వివరాలను తెలిపారు. అటవీ హక్కుల గుర్తింపు చట్టం క్రింద పోడు భూముల హక్కులు కమ్యూనిటీ హాల్ లు పొందేందుకు విధానాన్ని పంచాయతీ సెక్రెటరీ, లకు వీఆర్వోలకు సూచించారు. ఈ కార్యక్రమానికి డివిజనల్ పంచాయతీ అధికారి పి ఎన్ కుమార్ పాడేరు డివిజనల్ పరిధిలోని పంచాయతీ సెక్రటరీలు, వీఆర్వోలు మూడురోజుల శిక్షణలో పాల్గొన్నారు.

# 61వార్డులో ఇండిపెండెంట్ అభ్యర్థి ములంపాక నాగవేణి ప్రచారం



ములగాడ : విశాఖ పశ్చిమ నియోజకవర్గం పారిశ్రామిక ప్రాంతంలో గ్రేటర్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 61 వ వార్డు లో శనివారం కార్పొరేటర్ అభ్యర్దిని ములంపాక నాగవేణి తమ గుర్తు ప్రెషర్ కూకర్ కే ఓటు వేయమని ప్రచార కార్యక్రమం కొనసాగించారు. గెలిపిస్తే వార్డ్ ను ఆదర్శ వార్డ్ గా తీర్చు దిద్దుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలు, కార్యకర్తలు పాల్గొనడం జరిగింది. పలు చోట్ల మహిళలు ఆమెకు హారతులు పట్టి తమ అభిమానాన్ని చాటుకుని సంఘీభావాన్ని తెలిపారు. ఈ ప్రచార యాత్ర ప్రియ దర్శిని కాలనీ, ఇండస్ట్రియల్ కాలనీ వరకు సాగినది ఈ కార్యక్రమానికి నూకరాజు, చీపుర్లు వెంకటరమణ, సత్యాల మహేష్, సత్యాల కనకారావు, సత్యాల శ్రీనివాస్ రావు,సత్యాల కోటేశ్వరరావు, సుఖవాసి బాబు, బంక శ్రీనివాసరావు, కృష్ణారావు, తమినా మహేష్ కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# నేడు అభయాంజనేయ స్వామి వార్షికోత్సవం

### బొద్దపువానిపాలెం నేడు అన్నసమారాధన

పరవాడ : పరవాడ మండలము బొద్దపువానిపాలెం గ్రామంలో గల అంజనేయస్వామి వార్షికోత్సవము నేడు అంగరంఘ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేసామనీ గ్రామసర్పంచ్ బొద్దపుశ్రీనువాస్ కాసులు,మాజీసర్పంచ్ బొద్దపునూకరత్నం,మేడిశెట్టి బాలాజీనాయుడు,అలయదర్మకర్త బొద్దపు బాలాజీనాయుడు తెలిపారు. దీంట్లో బాగంగా మద్యహ్నం బారీ అన్నసమారాధనను ఏర్పాటు చేసామన్నారు. ఈకార్యక్రమానికి గ్రామంలో గల ప్రజలు అందరూ పాల్గోనీ స్వామి వారి ప్రసాదమును స్వీకరించాలనీ కోరారు.

### 2వ వార్డ్ జనసేన - బిజేపి ఉమ్మడి కార్పొరేటర్ అభ్యర్ధిని

# గనివాడ పార్వతిని గెలిపించాలని కోరుతూ

### ఎమ్మెల్సీ రాష్ట్ర భాజపా ప్రధాన కార్యదర్శి పీవీఎన్ మాధవ్ ప్రచారం



భీమునిపట్నం: జీ వి ఎం సి 2వ వార్డ్ జనసేన - బిజేపి ఉమ్మడి కార్పొరేటర్ అభ్యర్దిని గనివాడ పార్వతి నీ,గెలిపించాలని కోరుతూ ఎమ్మెల్సీ రాష్ట్ర భాజపా ప్రధానకార్యదర్శి పీవీఎన్ మాధవ్ ప్రచారం చేశారు.ఇంటింటికీ వెళ్లి మోడీ గారు అభివృద్ధి చూసికమలం గుర్తుపై ఓటేయమని అభ్యర్థించారు. గనివాడ.పార్వతి కి ఓటుతో రెండవ వార్డ్ అభివృద్ధి ముడిపడి ఉందన్నారు, మోడీ పవన్ కళ్యాణ్ గా నిబద్ధతను గుర్తించి భారతీయ జనతా పార్టీ జన సేన బలపరిచిన కార్పొరేటర్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్య క్రమంలో బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో గల పురపాలక సంఘాల

### సాధారణ ఎన్నికలు నిర్వహణకు ప్రకటించిన ఎలక్షన్ షెడ్యూల్

పెద్దాపురం : రాష్ట్ర ఎన్నికల కమిషన్ వారు రాష్ట్రంలో గల పురపాలక సంఘాలకు సాధారణ ఎన్నికలు నిర్వహణకు ఎలక్షన్ షెడ్యూల్ ను ప్రకటించియున్నారు. నోటిఫికేషన్ ప్రకారం పెద్దాపురం పురపాలక సంఘములో వున్న 29 వార్డులకు ప్రకటించిన 58 పోలింగ్ స్టేషన్లలో ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగును. ప్రజలు స్వచ్ఛందముగా ఓటు హక్కు వినియోగించుకోవలసిందిగా కోరడమైనది. ఓటర్ల జాబితాలో పెద్దాపురం పట్టణ పరిధిలో నమోదైన ఓటర్లు ఏ వార్డు పరిధిలోకి వస్తారు. వారు ఏ పోలింగ్ స్టేషనుకు ఓటు వేయడానికి వెళ్ళాలి, వారి ఓటరు క్రమ సంఖ్య మొదలైన వివరాలతో కూడిన ఓటరు స్లిప్పులు స్టేట్ ఎలక్షన్ కమిషన్ వారి ఆదేశాల మేరకు ఓటర్లకు పంపిణీ చేయుట జరిగినది. కావున ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించు కోవలసిందిగా కోరడమైనది. మరియు ఓటర్లు మరింత సులువుగా వారి వార్డు, వారి పోలింగ్ స్టేషను తెలుసుకొనుటకు వెబ్ సైటుద్వారా కూడా తెలుసుకోవచ్చును. edma.ap.gov.in వెబ్ సైటు ఓపెన్ చేసి బ్లింక్ అవుతున్న Know Your Polling Station మీద క్లిక్ చేసి, మన జిల్లా తూర్పు గోదావరి ఎంపిక చేసుకొని, పెద్దాపురం పురపాలక సంఘం సెలెక్ట్ చేసిన తరువాత Name బాక్సులో మీ పేరు ఇంగ్లీషులో టైప్ చేస్తే మీ ఓటరు నమోదు వివరాలు, వార్డు, పోలింగ్ స్టేషను చిరునామా, గూగుల్ మాప్ ద్వారా మీ పోలింగ్ స్టేషనుకు నేరుగా చేరుకొనే అవకాశం కూడా ఇవ్వడం జరిగినది. మరియు ప్రభుత్వం వారు జీఓ నెం 67 మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ డిపార్ట్మెంట్ తేదీ 22-02- 2021 ప్రకారం పురపాలక సంఘ పరిధిలోగల పబ్లిక్ రంగ సంస్థలు, కమర్షియల్ మరియు పరిశ్రమలలో పనిచేస్తున్న ఉద్యోగులు యావన్మంది ఓటు హక్కు వినియోగించుకొను నిమిత్తము మునిసిపల్ ఎన్నికల తేదీ 10-03-2021 వ తేదీన వేతన సెలవు PAID HOLIDAY గా ప్రకటించియున్నారు. ఉత్పత్తికి ఆటంకం లేకుండా సదరు శెలవు నిమిత్తము భవిష్యత్తులో వచ్చే తెలవు దినమును వర్కింగ్ డే గా పరిగణించవలసినదిగాను అప్పటికి సాధ్యం కానట్టైతే పోలింగ్ స్టేషన్ పరిధిలో గల ఉద్యో గులకు కొంత సమయము ఎన్నికలలో ఓటు వినియోగించుటకు సంబందిత యాజమాన్యాలను ప్రభుత్వం వారు ఉత్తరువులు జారీ చేసియున్నారు.

కావున ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పెద్దాపురం పురపాలక సంఘ పరిధిలో గల అన్ని ప్రభుత్వ రంగ సంస్థలు, ఇండస్ట్రియల్, పారిశ్రామిక సంస్థల యాజమాన్యాలు పురపాలక సంఘములో ఓటు హక్కు కలిగిన తమ ఉద్యోగులకు, కార్మికులకు, ఎన్నికల తేదీ అనగా 10-03-2021 తేదీన ఓటు హక్కు వినియోగించుటకు గాను అవకాశం కల్పించవలసినదిగా ఇందు మూలముగా తెలియజేయడమైనది.

### శాస్త్ర సాంకేతిక రంగాలను

# విశ్వవ్యాప్తం చేసిన ఘనత మహదేవ్‌వర్మదే

### - ఏయు రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణ మోహన్



మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయం అభివృద్ధికి , సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం ఏర్పాటుకు శాస్త్ర సాంకేతిక రంగాలను విశ్వవ్యాప్తం చేసిన ఘనత మహదేవ్ విక్రందేవ్ వర్మదే నని ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్ అన్నారు. శనివారం ఏయూ లోని ఫిజిక్స్ విభాగంలో మహదేవ్ విగ్రహ పున ప్రతిష్ట కార్యక్రమం జరిగింది. మహాదేవ్ విక్రమ్ వర్మ వారసులు మహారాజా విశ్వేశ్వర చంద్రచూడ్ దేవ్, సారికా దేవి సమక్షంలో కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్సీ పివిఎస్. మాధవ్ తో కలిసి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం ఆచార్య కృష్ణ మోహన్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం లో శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఆయన ఎంతో శ్రద్ధతో అభివృద్ధి చేశారన్నారు.

సైన్స్ కాలేజ్ కి భూములు ఇచ్చి, భవనం నిర్మించి నిధులు కూడా వెచ్చించారని తెలిపారు. సైన్స్ కాలేజీలో ఉన్నత చదువులు చదివి విశ్వవ్యాప్తంగా అనేక గొప్ప పదవుల్లో ఉన్నారన్నారు. మహదేవ్ వారసులు ఇక్కడ మౌలిక సదుపాయాలు నిచ్చేన ఏర్పాటు చేయడం మంచి పరిణామం అన్నారు. వారి సేవలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయక మన్నారు.

ఎమ్మెల్సీ పివిఎస్. మాధవ్ మాట్లాడుతూ మద్రాస్ రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్ విడిపోయినప్పుడు ఆంధ్ర విశ్వవిద్యాలయం ఏర్పాటు మహాదేవ్ విక్రమ్ దేవ్ వర్మ చేసిన కృషి మరువలేనిదన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీ కాలేజీ ఏర్పాటుకు ఆయన ముఖ్య పాత్ర పోషించారన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి మహాదేవ్ విక్రమ్ దేవ్ వర్మ వారసులుభాగస్వాములై ఉండాలన్నారు. వారి సంతానం కూడా మరింత అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో లిరిక్స్ విభాగాధిపతి డిబి. వెంకటాద్రి,

విక్రమ్ దేవ్ వర్మ వారసులు విశ్వేశ్వర చంద్రచూడ్ దేవ్, మహారాణి సారిక దేవి, కిషన్ రాథోడ్ ,క్రాంతి పిక్చర్స్ అధినేత వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

---

### కరోనా వైరస్ వ్యాప్తి సమయంలో నగర ప్రజలకు అండగా నిలిచి

## సమర్థ సేవలు అందించిన వైద్య సిబ్బందిని అభినందించిన ఛాన్సలర్ కోనేరు రామకృష్ణారావు

విశాఖపట్నం : ప్రముఖ విద్యావేత్త, గాంధేయవాది, తత్వశాస్త్రవేత్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత, గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ ప్రొఫెసర్ కోనేరు రామకృష్ణారావు (89) కు గీతం ఆస్పత్రి లో కోవిడ్-19 టీకాను శనివారం వేశారు. కరోనా వైరస్ వ్యాప్తి సమయంలో నగర ప్రజలకు అండగా నిలచి సమర్ధ సేవలు అందించిన వైద్య సిబ్బందిని ఛాన్సలర్ అభినందించారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి( జిమ్ సర్) ప్రొవైస్ ఛాన్స్ లర్ డాక్టర్ సి.వి.రావు పర్యవేక్షణలో జరిగిన ఈ టీకా కార్యక్రమ అనంతరం వైద్యులు పలువురు సీనియర్ సిటిజన్లకు టీకాలను కొనసాగించారు. గీతం ఆస్పత్రిని కోవిడ్-19 టీకా వేయడానికి అనువైనదిగా ప్రభుత్వం గుర్తించిన నేపద్యంలో ముందుగా అన్ని నిబంధనల ప్రకారం పేర్లను నమ్మెదు చేసుకున్న వారికి టీకాలు వేస్తామని గీతం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ద్వారకానాథ్ తెలిపారు. గీతం అస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షల నిమిత్తం ఐసిఎమ్ఆర్ పరీక్షా కేంద్రాన్ని నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

---

## జిల్లా లో ముమ్మరంగా వాహనాలు తనిఖీ

### - ఎన్నికల సందర్భంగా రంగంలోకి దిగిన స్పెషల్ ఎన్ఫోర్స్ మెంట్ బ్యూరో



విశాఖపట్నం : విశాఖపట్నం జిల్లా వ్యాప్తంగా అన్ని వాహనాలను తనిఖీ చేసే కార్యక్రమాన్ని స్పెషల్ ఎన్ఫోర్స్ మెంట్ బ్యూరో చేపట్టింది. శనివారం రాత్రి 7గంటల నుంచి రాత్రి 10గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని స్పెషల్ ఎన్ఫోర్స్ మెంట్ బ్యూరో అదనపు డిప్యూటీ కమిషనర్ వేజెండ్ల అజిత పేర్కొన్నారు. ఈ నెల 10న మున్సిపల్ ఎన్నికలు ఉన్నందున డైరెక్టర్ ఆదేశాలు మేరకు ఈ తనిఖీలు చేపడుతున్నామని స్పష్టం చేశారు.

---

# ప్రజా సంక్షేమాన్ని చూసి ఓటు వేయండి

### - జగనన్న పాలనలో ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరుతుంది
### - 50 వ వార్డు ప్రజలకు వి. ప్రసాద్ నిత్యం అందుబాటులో ఉంటారు
### - వార్డులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథం





మురళీనగర్ : ప్రజాసంక్షేమం చూసి ఓటు వేయాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రంగోలి జగన్నాథం 50 వ వార్డు ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం వార్డులోని సాయి రామ్ నగర్, సత్య నగర్, మంచుకొండ గార్డెన్స్ తదితర ప్రాంతాల్లో వార్డు కార్పొరేటర్ అభ్యర్థి వి ప్రసాద్ తో కలిసి రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గడపగడపకు వెళ్లి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఫ్యాన్ గుర్తు పై ఓటు వేయాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథం మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్మోహన్ రెడ్డి పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఆయన తెలియజేశారు. ఈ ప్రాంతంలో నిత్యం అందుబాటులో ఉంటున్న వావిళ్ళపల్లి ప్రసాద్ కు ప్రజల అండదండలు ఉండాలని రాబోయే గ్రేటర్ ఎన్నికల్లో వి ప్రసాద్ కు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఈ ప్రచారంలో 50 వ వార్డు అధ్యక్షురాలు పప్పల సునీత, మరియు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

---

## ఆర్ఎంపి నుండి సర్పంచ్‌గా ఎన్నికైన దడాల రమేష్





మాట్లాడుతున్న సర్పంచ్ రమేష్

కొయ్యూరు : కొయ్యూరు మండలం మారుమూల పంచాయతీలో ఆర్ఎంపీగా వైద్య సేవలు అందించి యూ.చీడిపాలెం పంచాయతీ నుండి వైసిపి సర్పంచ్‌గా దడాల రమేష్ ఎన్నికయ్యారు.

ఈ మేరకు ఆయన శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ అయితే గతంలో ఎన్నో ప్రభుత్వాలు పంచాయతీ అభివృద్ధికి నోచుకోలేదని, నేడు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలనలో పంచాయతీకి తన వంతు కృషి చేసి అభివృద్ధి వైపు నడిపిస్తానని చెప్పారు. దీనికి సచివాలయ సిబ్బంది తమకు సహకరిం చాలని ఆయన కోరారు.

---

# గ్రేటర్ ఎన్నికల్లో టీడీపీ కి ప్రజలు బుద్ధి చెప్పాలి

### - ఉత్తరాంధ్ర అభివృద్ధిని అడ్డుకుంటున్నా చంద్రబాబు
### - 53వార్డు బర్కత్ అలీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన కె.కె రాజు





మర్రిపాలెం : విశాఖ ఉత్తర నియోజకవర్గం జీవీఎంసీ ఎన్నికల ప్రచారంలో భాగంగా 53వార్డు అభ్యర్థి బర్కత్ అలిఆధ్వర్యంలో శివనగర్, శ్రీ రామ నగర్ కాలనీ, ఆంధ్ర కేసరి నగర్, జాఖీర్ హుస్సేన్ నగర్, సాయి నగర్, మసీద్ వీధి తదితర ప్రాంతంలో ఎన్నికల ప్రచారం జరిగింది.ఈ ప్రచారంలో విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె కె రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కె.కె రాజు మాట్లాడుతూ మన ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి మన ఉత్తరాంధ్ర ప్రాంతం అభివృద్ధి కోసం విశాఖ ను పరిపాలన రాజధాని గా చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారని దీనికి తెలుగుదేశం నాయకులు అడ్డుపడుతున్నారని అన్నారు. ఈ జీవీఎంసీ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించి టి డి పి సరైన గుణపాఠం చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు గుజ్జు వెంకట రెడ్డి,కాశీ విశ్వనాధం ,గుడ్ల వెంకట రమణి,నెట్టిమి ఉదయ్ భాస్కర్, షేక్ బాబ్జీ, మరే జన్ని, రామలక్ష్మి, సుశీల, హనుమంతు, కనక రాజు, రామారావు, సదరం జ్ఞనేశ్, ఆదిలక్ష్మి, జయ, సుజాత,రమణమ్మ, జఖేరుద్దిన్,53వార్డు నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

---

## జీవిఎంసి ఒకటి రెండు టీడీపీ కార్పొరేటర్ అభ్యర్థులు ప్రచారం



భీమునిపట్నం: జీవిఎంసి ఒకటి రెండు టిడిపి కార్పొరేటర్ అభ్యర్థులు. పిట్టా శ్రీదేవి ,గాడు చిన్ని కుమారి లక్ష్మి లు ఇంటింటి ప్రచారం లో దూసుకొని వెళ్తున్నారు శనివారం విసృతంగా ప్రచారం నిర్వ హించారు.

వార్డ్‌ల లో ఉన్న సమస్యల ను అడిగి తెలుసుకొని త్వరలో పరిష్కారం చేస్తామన్నారు. కార్యక్రమంలో....

పిట్టా సురేష్, తమ్మిన సూరిబాబు, చిలకా నర్సింగరావు,, పిల్లా రాజే ష్, నమ్మి శ్రీరామ్, బర్ల సూర్యనారాయణ, బర్ల రాములు,రాజు లు పాల్గొన్నారు.

---

## ఈనెల 8 న మహిళా దినోత్సవం

శ్రీకాకుళం : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఈ నెల 8వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరక్టర్ జి.జయదేవి తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన జారీ చేస్తూ 8వ తేదీ ఉదయం 10 గంటల నుండి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

**జేమ్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం** : మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జేమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్ మరియు జిల్లాలో మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు జెమ్స్ ఆసుపత్రి సహాయ ఆర్.ఎం.ఓ డా.ప్రవీణ్ తెలిపారు. జిల్లా కలెక్టర్ జె నివాస్, పోలీసు సూపరింటిండెంట్ అమిత్ బార్దార్ ల సూచనల మేరకు వైద్య శిబిరాలను సోమ వారం ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల సిబ్బందికి కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్నామని, ఆయా శాఖలలో పనిచేస్తున్న మహిళలతో పాటు వారి కుటుంబ సభ్యులు వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. పోలీస్ సిబ్బందికి ఎచ్చర్ల పోలీస్ కమ్యూనిటీ హాల్ లో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో జిల్లాలోని మహిళా పోలీసులతో పాటు, హెూంగార్డు కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు అన్నీ పూర్తిగా ఉచితమని తెలిపారు. 14వ తేదీ వరకు మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు : ఈ నెల 8వ తేదీ నుంచి 14వ తేదీ వరకు జేమ్స్ ఆసుపత్రిలో జిల్లాలోని మహిళలు అందరకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రవీణ్ తెలిపారు. ఈ వైద్య శిబిరాల్లో జిల్లాలోని మహిళా ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యులు, మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

---

## ఈ స్థలం ఎటువంటి లేఅవుట్లకు అనుమతివ్వలేదు

మాకవరపాలెం : మాకవరపాలెం మండలం తామరం గ్రామ పంచాయతీ పరిధిలో గల పెట్రోలు బంకు సమీపంలో లేఅవుట్‌కు రెవెన్యూ ద్వారా కానీ పంచాయతీ ద్వారా కానీ ఏవిధమైన అనుమతులు లేవని పంచాయతీ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. దీన్ని అక్రమ లేఅవుట్‌గా గుర్తిస్తూ ఈ స్థలాన్ని ఎవరైనా కొనుగోలు చేసిన యెడల అది చెల్లదని గ్రామ పంచాయితీ సెక్రటరీ తెలిపారు.

### యరకన్నపాలెంలో పైపులైన్ పనులు

మాకవరపాలెం : మాకవరపాలెం మండలం రాచపల్లి పంచాయతీ యరకన్నపాలెంలో ఎట్టకేలకు తాగునీటి కష్టాలు తీరనున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పంచాయతీ సర్పంచ్ రుత్తల సీతారాముడు సుమారు రూ.5లక్షలతో పైపులైన్ పనులను ప్రారంభించారు. ప్రస్తుతం ఈ పనులు చురుగ్గా జరుగుతున్నాయి.

# అర్హులైన పారిశుధ్య కార్మికులందరికీ ఇళ్లు పట్టాలు

**- జివిఎంసిలో ఖాళీగా ఉన్న సుమారు 1700 పోస్టులను త్వరిత గతిన భర్తీకి ప్రయత్నాలు చేస్తా**

**- పెండింగులో ఉన్న వేతనాలను తక్షణమే చెల్లించే దిశగా చర్యలు**



**- ఎంపీ విజయసాయి రెడ్డి**

విశాఖపట్నం : అర్హులైనా ప్రతి ఒక్కరికీ ఇల్లు పట్టాలు మంజూరు చేస్తామని రాజ్యసభ సభ్యుడు విజయసాయి ర్డి అన్నారు. సుమారు 1.80 వేలు ఇల్లు స్థలాలు ప్రభుత్వం ఇక్కడి పేదలకు మంజూరు చేసిందని ప్రతిపక్ష టిడిపి ప్రజా సంక్షేమాన్ని అడ్డుపడి కోర్టును ఆశ్రయించడంతో అది తాత్కాలికంగా నిలిచిందని త్వరలోనే మంజూరైన ఇల్లు పట్టాలు లబ్ధిదారులకు అందుతాయని అన్నారు. అర్హులైన పారిశుధ్య కార్మికులు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఈ మేరకు శనివారం నగరంలోని శివాజీ పార్కులో జివిఎంసి పారిశుధ్య కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు సమస్యలపై చర్చించి వాటిని పరిష్కరించేదిశగా ప్రతియ్నం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘం గౌరవ అద్యక్షులు గంట్ల శ్రీనుబాబు,

జివిఎంసి ఉద్యోగుల గుర్తింపు సంఘం అద్యక్షుడు ఆనంద్ కార్మికులు సమస్యలను విజయసాయి రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలపై స్పందిం చిన విజయసాయి రెడ్డి పలు సమస్య లను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు మిగిలిన డిమాండ్లపై అధికారులతో చర్చించి తరిగి మీ మందుకు వస్తానని హామీ ఇచ్చారు.


పారిశుద్య పనులు జనాభా ప్రాతిపదికన కేటాయించాలన్న డిమండుకు స్పందించిన విజయసాయి రెడ్డి జివిఎంసిలో ఖాలీగా ఉన్న సుమారు 1700 పోస్టులను త్వరిత గతిన భర్తీ చేసేదిశగా ప్రయత్నాలు చేస్తానని ఈ మేరకు ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికీ తీసుకువెల్తానని అన్నారు. జిఓ నంబర్ 212 ప్రకారం అర్హులైన పారిశుద్య కార్మికులకు రెగ్యులరైజ్ చెయ్యాలన్న డిమాండు, చనిపోయిన, దీర్ఘకాలిక వ్యాధులకు గురైన పారిశుద్య కార్మికుల కుటుంబాలలోని వ్యక్తులకు ఉద్యోగం కల్పించాలన్న డిమండ్ పై అధికారులతో చర్చించి మీ ముందుకు వస్తానని హామీ ఇచ్చారు.

పారిశుద్య కార్మకులలోని డ్రైవర్లు,సూపర్వైజర్లును హెల్త్ అలవెన్సులు ఇప్పించే విషయమై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెల్తానని హామీ ఇచ్చారు. పారిశుద్య కార్మికులు, మలేరియా వర్కర్లుకు సంబందించి పెండింగులో ఉన్న వేతనాలకు తక్షణమే చెల్లించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మంత్రులు ముత్తంశెట్టి శ్రీనివాస్, కన్నబాబు, ఎంపి ఎంవివి సత్యన్నారాయణ, పశ్చిమ నియోజక వర్గ వైకాపా సమన్వయ కర్త మల్లా విజయప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌సీఆర్ డబ్ల్యూ అభ్యర్థనపై స్పందించిన విజయసాయిరెడ్డి

**- అక్రిడేషన్ల నిబంధనలు సడలించాలంటూ ఐఅండ్ పీఆర్ కమిషనర్‌కు లేఖ**

**- అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్ కుమార్ పేరును ప్రస్తావిస్తూ పలు సూచనలు చేసిన రాజ్యసభ సభ్యులు**



విశాఖపట్నం : రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న అక్రిడేషన్ల సమస్య పరిష్కారానికి స్మార్ట్ సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఎసేసీఆర్‌డబ్ల్యూ) అలుపెరగని పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. ఆన్లైన్ విధానం, నిబంధనలను సడలించాలంటూ అసోసియేషన్ అధ్యక్షుడు బంగారు అశోక్ కుమార్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తు న్నారు. ఈ క్రమంలో ఇటీవల పలువురు వైఎస్సార్ సీపీ కీలక నాయకులను కలిసి వినతి పత్రాలను సమర్పించారు. దీంతో ఉత్తర నియోజకవర్గ కన్వీనర్ కె.కె. రాజు ఈ విషయాన్ని వైఎస్సార్ సీపీ కీలక నాయకులు, రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఏ సమస్యపైనైనా వెనువెంటనే స్పందించే ఆయన ఈ అంశంపై కూడా సత్వరం దృష్టి సారించారు. ఈ మేరకు ఐ అండ్ పీఆర్ కమిషనర్ టి.విజయ్ కుమార్ రెడ్డికి ఆయన స్వయంగా ఓ లేఖ ద్వారా అసోసియేషన్ అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. కఠినమైన నిబంధనల కారణంగా రిపోర్టర్లు ప్రభుత్వం నుండి అక్రెడిటేషన్ పొందే హక్కును కోల్పోతున్నారని ఆయన పేర్కొన్నారు. జీవో నంబర్ 142 కారణంగా అనేక మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆ నిబంధనలను సడలించాలని లేఖలో పేర్కొన్నారు.

విలేకరుల డిమాండ్లను సానుభూతితో పరిగణించాలని ఆయన అభ్యర్థించారు. విశాఖపట్నం స్మార్ట్ సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బంగారు అశోక్ కుమార్ ప్రస్తావించిన సమస్యను పరిశీలించి, ఆ విభాగం మార్గ దర్శకాలు, పద్ధతుల ప్రకారం పని చేయడానికి ఏర్పాట్లు చేయాలని ఆయన కమిషనర్‌కు స్పష్టమైన సూచనలు చేశారు. సత్వరం ఈ సమస్యను పరిష్కరించాలని ఆ లేఖలో పేర్కొన్నారు.

# సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధితో పని చేస్తున్నాం

**- అపరిష్కృతంగా ఉన్న 60 అడుగుల రోడ్డును నిర్మిస్తాం**

**- ప్రతి వార్డుకి రెండు చెత్త సేకరించే వాహనాలు**

**- రాజ్యసభ సభ్యులు విజయ సాయి రెడ్డి**

ఎన్ ఏ డి కొత్త రోడ్ /కరాస : ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రతి వార్డుకి రెండు చేత్త సేకరించే వాహనాలు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని రాజ్యసభ సభ్యులు విజయసాయి రెడ్డి అన్నారు. ఎన్నికల అనంతరం దీనిని అమలు చేయనున్నామని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పశ్చిమ నియోజకవర్గంలో ని 52 వ వార్డు పరిది లో వార్డు కార్పొరేటర్ అభ్యర్థి జీయ్యని శ్రీధర్ కు మద్దతుగా కరాస వద్ద ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమం మరియు అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలు ఏ మేరకు సంతృప్తి చెందారో ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల ఫలితాలు నిరూపించాయని అన్నారు. ఈ సుపరిపాలన కొనసాగించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని అన్నారు. స్థానిక సమస్యలపై తక్షణమే స్పందించి వాటిని పరిష్కరించే విధానం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ప్రజల సమస్యలు పరిష్కారం లో ఉన్న చిత్తశుద్ధి ని తెలియజే స్తుందని అన్నారు. స్థానిక సమస్యలపై మాట్లాడుతూ స్మశానవాటికను అభివృద్ధి చేస్తామని, వార్డు పరిధిలోని వివిధ. పార్కులను పునరుద్దరిస్తామని హామీ ఇచ్చారు. అపరిష్కృతంగా ఉన్న 60 అడుగుల రోడ్డును నిర్మిస్తామన్నారు. ఈ మేరకు ఎయిర్ పోర్టు కు ప్రత్యామ్నాయ భూమి అప్పగిస్తామని




అన్నారు. అసంపూర్తిగా మిగిలి ఉన్న టిడ్కో ఇల్లు త్వరిత గతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైల్వేశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి తాత్కాలికంగా షెడ్లు వేసుకుని నివసిస్తున్న వారిని ఇబ్బంది కలిగించకుండా ఉండేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మల్ల విజయప్రసాద్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## వైయస్ఆర్ కుటుంబం నకు


# ముస్లింలే అండ దండ

**- వంశీకృష్ణకు స్థానిక ప్రజలు, ముస్లింలు ఘన స్వాగతం - 21వ వార్డ్ విజయంలో మీ వెంటే ఉంటామని భరోసా**

**- ప్రచారంలో భారీగా పాల్గొన్న ముస్లింలు, మహిళలు, యువత - పలువురు కి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానం**



విశాఖపట్నం : గ్రేటర్ విశాఖ 21వ వార్డులో వైస్సార్సీపీ నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ కు ముస్లింలు ఘన స్వాగతం పలికారు. వంశీకృష్ణ శ్రీనివాస్ విజయం లో ఆయన వెంటే ఉంటామన్నారు. జీవీఎంసీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం వంశీకృష్ణ మసీదు వీధి, రెల్లి వీధుల్లో, నేతాజీవీధి, పీతల వీధి, చినవాల్తేర్ మెయిన్ రోడ్, మసీదు రోడ్ ,సీబీఐ డౌన్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వంశీకృష్ణకు ముస్లింలు, యావత్ యువత ,మహిళలు ఘన స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ మహానేత సర్గియ రాజశేఖర్ రెడ్డి నుంచి జగన్న కుటుంబం ముస్లింల అభివృద్ధి కి కృషి చేస్తుందన్నారు. ముస్లింల కు ఉద్యోగాల్లో, రాజకీయాల్లో రిజర్వేషన్లు, ముస్లిం విద్యార్థులకు ఫీజు రీయంబర్స్మెంట్ అమలు చేసిన ఘనత వైస్సార్ కి దక్కుతుందన్నారు. ఆయన స్ఫూర్తితో 21వ వార్డు తో పాటు నగరంలోని ముస్లింల అందరి అభిరుద్దికి బాటలు వేస్తానని హామీ ఇచ్చారు. 21వ వార్డులో తన గెలుపు కోసం శ్రమిస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏం ఎల్ ఏ బాబూరావు , వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు.



# ప్రియాంకతోనే అభివృద్ధి సాధ్యం





**- 6 వార్డుకు మహర్దశ**

**- ప్రజల మదిలో చెరగని ముద్ర వేసుకున్న మంత్రి కుమార్తె**

**- ప్రియాంక దూకుడు తో టీడీపీ,జనసేన శిబిరాలలో నిరాశ ఛాయలు**

**- ప్రత్యర్థి పార్టీలను వణికిస్తున్న వైకాపా**

**- ఆదరణ కూడా నోచుకోని టీడీపీ**

మధురవాడ : విశాఖ జీవీఎంసీ ఎన్నికల అభ్యర్థుల్లో హై టెన్షన్ మొదలైంది.ఉత్కంఠ రేపే ప్రచారాలతో వేడి ఎక్కుతోంది. మధురవాడ 6 వార్డులో మంత్రి కుమార్తె పోటీలో ఉండడంతో నగరం అంతా ఇప్పుడు అంతే హీట్ నెలకొంది. దీనితో పోటీలో ఉన్న అభ్యర్థులు ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ కొత్త తరహా పాలిటిక్స్ కు తెరలేపారు. మహిళలు యువతే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు, ప్రత్యర్థి వ్యూహాలను ఛేదిస్తూ ప్రియాంక 6 వార్డులో దూకుడు పెంచారు. తనదైన శైలిలో ప్రచారం నిర్వహిస్తూ అందర్నీ ఆకట్టుకున్నారు. కులమతాలకు అతీతంగా జగన్ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను గడప గడపకి తెలియజేస్తూ వినూత్నంగా ప్రచారం చేస్తూ అభివృద్ధి కేవలం వైసీపీ తోనే సాధ్యమని చెబుతూ ప్రజల్లోకి దూసుకుపోతున్నారు. ఇప్పటికే ప్రత్యర్థి పార్టీలకు అందనంత ఎత్తులో ఉన్నప్పటికీ ప్రజల మధ్యలోనే తిరుగుతూ ప్రచారాన్ని మరింత ముమ్మరం చేస్తున్నారు. ప్రియాంక ప్రచార దాటికి ప్రత్యర్థి పార్టీల నాయకులు ఇళ్ల కే పరిమితమయ్యారు. ఆరో వార్డు లో వైసిపి అభ్యర్థి తప్ప మరెవ్వరూ లేరన్న విధంగా ప్రజలు హారతులు పడుతున్నారు. తండ్రి అవంతి మార్కు కనబడకుండా తనకంటూ ప్రత్యేక శైలితో 6వ వార్డు వైస్సార్సీపీ కార్పొరేటర్ అభ్యర్థి లక్ష్మి ప్రియాంక ప్రజా సమస్యల పరిష్కారంలోనూ తన మార్కును చూపిస్తున్నారు.వార్డు పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసు కొని, అక్కడికక్కడే వాటిని పరిష్కరించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో తండ్రికి తగ్గ కుమార్తెగా నీరాజనాలు అందుకుంటున్నారు.



**భీమిలీ కోట లో ప్రజా సేవకుడు..**

**- ముత్తం శెట్టి శ్రీనివాసరావు**

ఆయన ఓటమెరుగని ఒక రాజకీయ యోగి. ఎన్నికల్లో ఎంతోమందిని మట్టి కరిపించి విజయాన్ని అందుకున్న యోధుడు, భీమిలి కోట లో ప్రజా సేవకుడు 2009లో రాజకీయంలో ఓనమాలు దిద్ది ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన తిరిగి 2019 లో అదే నియోజకవర్గం నుంచి గెలిచి జగన్ ప్రభుత్వంలో మంత్రిగా బాధ్యతలు చేపట్టి ప్రజల మన్ననలు పొందిన అవంతి శ్రీనివాస్.ఇప్పుడు వారసురాలిగా ప్రియాంక స్థానిక సమరంలో తన సత్తా చాటుతూ గెలుపు దిశగా అడుగులు వేస్తుంది.దీనితో పచ్చ జెండాకు ఎదురు దెబ్బ తగలడం ఖాయమని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## మార్పు కోసమే భాజపాతో పొత్తు : పవన్

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో మార్పు తెచ్చేందుకే భాజపాతో కలిశామని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. విపక్షాలు ఎన్నికల్లో పోటీ చేయకుండా వైకాపా దౌర్జన్యాలు చేస్తోందని ఆరోపించారు. అధికార పార్టీ దౌర్జన్యాలకు జనసైనికులు ఎదురు నిలిచారని వెల్లడించారు. ఒత్తిళ్లు ఉన్నా జనసైనికులు ఎన్నికల బరిలో నిలిచారని పేర్కొన్నారు. మార్పు కోసమే యువత ధైర్యంతో ఎన్నికల్లో పోటీ చేస్తోందని చెప్పారు. పన్నుల రూపంలో వచ్చిన సొమ్మును నచ్చిన పథకాల పేరుతో పంచుతున్నారని పవన్ ఆక్షేపించారు. అర్హులకు పింఛన్లు, పథకాలు ఆపడం అత్యంత దుర్మార్గమన్నారు. ప్రశ్నించకపోతే రాష్ట్రంలో దారుణాలు ఇలా కొనసాగుతూనే ఉంటాయని.. వైకాపాకు ఓటేస్తే ప్రజలను యాచకులుగా మారుస్తారని వ్యాఖ్యానించారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS ., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com